
# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి ‖ సంపుటి : 1 ‖ సంచిక : 3 ‖ సోమవారం ‖ 17.08.2026 ‖ పేజీలు : 8 ‖ వెల రూ. 2

Medchal Malkajgiri ‖ Volume: 1 ‖ Issue: 3 ‖ Monday ‖ 17.08.2026 ‖ Pages: 8 ‖ Rate: 2

3లో..

## వందేమాతరం వివాదం

**కాంగ్రెస్‌పై అమిత్ షా ఆరోపణలు**

**మధ్యలోనే ఆపేశారంటూ విమర్శలు**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం గీతాన్ని మధ్యలోనే ఆపేశారంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు.



## దిమాగీ నక్సల్ రగడ

**మోదీ వ్యాఖ్యలకు చిదంబరం షాకింగ్ రిప్లై**

**గర్వంగా చెబుతున్నానంటూ చిద్దూ కౌంటర్**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'దిమాగీ నక్సల్' వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని ప్రభుత్వం అణచివేసిందని చెబుతూనే, మావోయిస్టు భావజాలం ఉన్న కొందరు వ్యవస్థలో కీలక స్థానాల్లోకి చొరబడి విధానాలను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారని మోదీ ఆరోపించారు. (వివరాలు 3లో..)



## కేబీఆర్ ట్రాఫిక్‌కు భారీ ఊరట

**వన్‌వేతో మారనున్న రూట్లు..**

**ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లతో పరిష్కారం**

**రూ.1,090 కోట్లతో భారీ ప్రాజెక్టు**

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సిటీ ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న కీలక జంక్షన్లలో రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో 7 మల్టీ లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్లు, 7 డైరెక్షనల్ అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. (వివరాలు 3లో..)



## బీసీఐ చైర్మన్ క్షమాపణలు

**విద్యార్థుల స్వేచ్ఛకై బీసీఐ భరోసా**

న్యాయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వివాదం నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మణన్ కుమార్ మిశ్రా క్షమాపణలు తెలిపారు. ఆగస్టు 15న విడుదల చేసిన మూడు పేజీల లేఖలో తన మాటలు, లేఖలు, ఆదేశాలతో ఏ విద్యార్థి మనోభావాలు దెబ్బతిన్నా తాను చింతిస్తున్నానని, హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నానని చెప్పారు. (వివరాలు 3లో..)



## హైదరాబాద్ సెగ.. బెంగళూరుకు

**సీజేఐ ఆహ్వానంపై విద్యార్థుల అభ్యంతరం**

**లా కాలేజీల్లో పెరుగుతున్న అసమ్మతి**

**ఎన్‌ఎల్‌ఎస్‌ఐయూ విద్యార్థుల సంఘీభావం**

హైదరాబాద్‌లోని నల్సార్ వివాదం తాజాగా బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీకి చేరింది. (వివరాలు 3లో..)



వివరాలు2లో..

# సొంత చెల్లికే కేటీఆర్ అన్యాయం

**ప్రజలకు ఏం న్యాయం చేస్తారు?**

- కేసీఆర్ అసెంబ్లీలో చర్చించాలి
- కాంగ్రెస్‌ది ప్రజా పాలన
- బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన
- పదేళ్ల పాలనపై సీఎం రేవంత్ ఫైర్

పరకాలలో జరిగిన ప్రజా పాలన ప్రగతి బాట బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాజీ మంత్రి కేటీఆర్, కేసీఆర్ కుటుంబంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రక్తం పంచుకున్న సోదరికి సాయం చేయాల్సి వస్తుందనే కారణంతో ఇంటి నుంచి బయటికి గెంటేసిన చరిత్ర కేటీఆర్‌దని ఆరోపించారు. కొడుకుకు బుద్ధి చెప్పాల్సిన తండ్రి కళ్లున్న ధృతరాష్ట్రుడిలా మారిపోయారని కేసీఆర్‌ను విమర్శించారు. అదే సమయంలో తనను ప్రజల సోదరుడిగా అభివర్ణిస్తూ, ఆడబిడ్డలను గౌరవించేందుకు తమ ప్రభుత్వం ఇందిరమ్మ చీరను సారెగా అందిస్తోందని చెప్పారు. పదేళ్లపాటు ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను బలి తీసుకున్నారని ఆరోపిస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని, నిరుద్యోగుల భవిష్యత్ కోసం వయోపరిమితిలో సడలింపులు కల్పించామని వెల్లడించారు.



## ములుగు అభివృద్ధిపై రేవంత్ కీలక ప్రకటన

- సీతక్కపై ప్రశంసలు.. ప్రత్యర్థులపై విమర్శలు
- ములుగుతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం

ములుగు కొత్త కలెక్టరేట్ సముదాయం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా సమ్మక్క-సారక్క ఆశీర్వాదంతో ములుగు నుంచే పాదయాత్ర ప్రారంభించామని, రాష్ట్రంలోని గూడేలు, పల్లెల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నామని గుర్తుచేశారు. ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. మంత్రి సీతక్క అక్కగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు.



## పదేళ్ల పాలనపై ప్రశ్నల వర్షం

- కేసీఆర్ పాలనకు మీపిల్లలే రిపోర్టు కార్డ్
- బీఆర్ఎస్ పాలనపై బండి సంజయ్ ఫైర్

బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యుల వ్యాఖ్యలనే ఆ పార్టీ పాలనకు రిపోర్టు కార్డుగా అభివర్ణించారు. "కేసీఆర్ పాలనకు మీ పిల్లలే రిపోర్టు కార్డు ఇస్తున్నారు" అంటూ బీఆర్ఎస్‌పై సెటైర్లు వేశారు. అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణలో మంచి పాఠశాలలు, కళాశాలలు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. (2లో..)



## బీసీల లెక్క తేల్చాల్సిందే!

- కులగణనలో ప్రత్యేక స్థానం కావాలి
- కేంద్రానికి పొన్నం ప్రభాకర్ డిమాండ్



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణనలో బీసీల వివరాలకు స్పష్టమైన స్థానం లేకపోవడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. కులగణనలో బీసీ జనాభాను శాస్త్రీయంగా లెక్కిస్తేనే వారికి దామాషా ప్రకారం సామాజిక న్యాయం అందుతుందని స్పష్టం చేశారు. 40 ప్రశ్నల్లో ఎస్సీ, ఎస్టీ తదితర వర్గాల ప్రస్తావన ఉన్నా ఓబీసీల వివరాలను స్పష్టంగా పొందుపరచలేదని విమర్శించారు. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించాలంటే ప్రామాణిక కులగణన లెక్కలను సుప్రీంకోర్టు ముందు ఉంచాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీయంగా బీసీ కులగణన నిర్వహించి వివరాలను కోర్టు ముందు ఉంచిందని గుర్తుచేశారు. బీసీలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఏప్రిల్ 1, 2025న కేంద్రం ప్రకటించిన విధంగానే కులగణనలో బీసీలను చేర్చాలని డిమాండ్ చేశారు. (2లో..)

## నగరంలో ఈ-ఆటోల పరుగులు

• ఆటోలకు ఎలక్ట్రిక్ టర్న్ • 18,766 ఆటోలకు కొత్త రూపం

# పేదింటి ఆడబిడ్డలకు భరోసా



- కళ్యాణలక్ష్మిపై బీఆర్ఎస్ సమరం
- రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు
- రద్దుపై కాంగ్రెస్‌కు కేటీఆర్ వార్నింగ్

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపి పేదింటి ఆడబిడ్డలకు అందుతున్న ఆర్థిక భరోసాను తొలగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించిందని గుర్తుచేశారు. రూ.51 వేలతో మొదలైన సాయం రూ.75,116కు, తర్వాత రూ.1,00,116కు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో సుమారు 13 లక్షల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర సాయం అందిందని తెలిపారు. కోవిడ్ సమయంలోనూ పథకం కొనసాగిందని చెప్పారు. (వివరాలు 2లో..)



3లో..

## రాహుల్ ఆస్తుల కేసు

**నేడు సుప్రీంకోర్టులో విచారణ**

**అలహాబాద్ హైకోర్టు ఆదేశాలపై సవాల్**



- అధికార మార్పునకు ఛాన్స్ లేదంటున్న కాంగ్రెస్..
- రేవంత్‌కు సెండ్ ఆఫ్‌పై బీఆర్ఎస్ కాన్ఫిడెన్స్

## మాదే సెకండాఫ్.. కాదు.. మీకు సెండాఫ్

మూడేళ్ల గడప దగ్గర తెలంగాణ రాజకీయాలు గేర్ మార్చబోతున్నాయి. కాంగ్రెస్ సర్కార్‌కు మరో నాలుగు నెలల్లో మూడేళ్లు పూర్తి. కానీ రేవంత్‌రెడ్డి లెక్కలు మాత్రం 2034 వరకూ వెళ్లిపోయాయి. మళ్లీ అధికారం మాదేనంటూ ధీమా.. సీఎం కుర్చీపై ఇప్పుడే ఆశలు పెట్టుకోవద్దంటూ ప్రత్యర్థులకు సూటి వార్నింగ్! హామీలు అమలు చేశాం.. పాలన గాడిలో పెట్టామన్నది కాంగ్రెస్ వాదన. కానీ కారు పార్టీ మాత్రం "రేవంత్ ఇక చాలు.. వచ్చేది బీఆర్ఎస్" అంటూ కౌంటర్ ఇస్తోంది. మరోసారి సారు సర్కారంటూ క్యాడర్‌లో జోష్ నింపుతోంది. ఇదే సమయంలో కాషాయం పార్టీ తెలంగాణపై ఫోకస్ పెంచుతోంది. చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ పూర్తయ్యాయంటూ.. ఇక పూర్తి స్థాయి దూకుడేనని సంకేతాలిస్తోంది. ఈటల-బండి దూకుడుతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గట్టి సవాల్ విసరాలన్నది వ్యూహం. తెలంగాణ అస్థిత్వం కోసం రాజన్న పోరాటం మరో రాజకీయ ట్రాక్. మరోవైపు "నేను సైతం" అంటూ కవిత అడుగులు వేస్తున్నారు. ఒకవైపు కాంగ్రెస్ అధికారం నిలబెట్టుకునే లెక్కలు.. మరోవైపు బీఆర్ఎస్ పునరాగమన వ్యూహాలు.. ఇంకోవైపు బీజేపీ దూకుడు.. మధ్యలో కవిత రాజకీయ అడుగులు! తెలంగాణ కొట్లాటలో ఎవరి వ్యూహం పనిచేస్తుంది? ఎవరి లెక్క తారుమారవుతాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. రాజన్న చెబుతున్నట్టుగా తెలంగాణ ఎవరి పాలైందన్న వాదన ప్రయాణమెటు? అన్నది తేలాలి.



## నేను ఎక్కడికీ పోను.. ఖమ్మం గడ్డ వదలను

**మంత్రి తుమ్మలపై పువ్వాడ విమర్శలు**

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎక్కడికీ వెళ్లబోనని, ఖమ్మం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. తనపై వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. నాలుగు దశాబ్దాలుగా పువ్వాడ కుటుంబానికి ఖమ్మంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన పువ్వాడ.. తుమ్మల ఏ పార్టీలో ఉన్నా మంత్రి పదవులు అనుభవించారని, ఖమ్మం అభివృద్ధికి మాత్రం చెప్పుకునే స్థాయిలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరూ చేయని పనులను తానే చేశానని చెప్పుకోవడం తప్ప ఖమ్మానికి తుమ్మల చేసిందేమీ లేదని ఆరోపించారు.



## మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె!

**రూ.100 కోట్ల ప్రజాధనం వృథా**

**స్మార్ట్ కార్డులపై దాసోజు శ్రవణ్ ఫైర్**

స్మార్ట్ రేషన్ కార్డుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఇప్పటికే ఉన్న ఈరేషన్ కార్డులను రద్దు చేసి 1.05 కోట్ల కొత్త లామినేటెడ్ కార్డుల ముద్రణ, లామినేషన్, రవాణా కోసం సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. కార్డులపై సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ముద్రించడాన్ని ఆయన తప్పుబట్టారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగుల పెన్షన్లు, గ్రాట్యుటీ బకాయిలకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం తన ప్రచారం కోసం మాత్రం వందల కోట్లు ఖర్చు చేయడం 'మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె' అన్నట్లుందని ఎద్దేవా చేశారు.




## కార్డులు-ఫొటోలు.. రాజకీయ రగడ

**రేషన్ కార్డులపై ఫొటోలెందుకు?**

**రేవంత్ సర్కార్‌పై సునీత ఫైర్**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అబద్ధాలతో కూడుకున్నవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆమె మాట్లాడుతూ ప్రజాధనంతో సభలు నిర్వహించి కేసీఆర్, హరీశ్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేయడం తప్ప రాష్ట్రాభివృద్ధిపై సీఎం స్పష్టమైన ప్రణాళిక చెప్పలేదని ఆరోపించారు. మిషన్ భగీరథ ద్వారా కేసీఆర్ ఇంటింటికీ తాగునీరు అందించారని, దాన్ని నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్ ప్రభుత్వానిదేనన్నారు. రేషన్ కార్డుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 6.47 లక్షల రేషన్ కార్డులు ఇచ్చినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాసనమండలిలోనే చెప్పారని గుర్తుచేశారు.



బండ్ల గణేష్ కుమార్తె వివాహ వేడుకకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

# సొంత చెల్లికే కేటీఆర్ అన్యాయం

## ప్రజలకు ఏం న్యాయం చేస్తారు?

- కేసీఆర్ అసెంబ్లీలో చర్చించాలి
- కాంగ్రెస్‌ది ప్రజా పాలన
- బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన
- పదేళ్ల పాలనపై సీఎం రేవంత్ ఫైర్



### రైతు, మహిళలే ప్రభుత్వ ప్రాధాన్యం

రైతులు, మహిళలు, నిరుద్యోగుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు ఉన్నా, రాష్ట్రంలోని ప్రాజెక్టులను నింపి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. 32 నెలల్లో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.90 వేల కోట్లు చెల్లించామని, రైతు భరోసా, రుణమాఫీ కోసం రెండున్నరేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. సన్నధాన్యానికి బోనస్ ఇచ్చామని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సున్నా వడ్డీ రుణాలు, యూనిఫాం కుట్టు పనులు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి అవకాశాలు కల్పించామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తామని, ఉద్యోగాలు ఇవ్వడం తమ బాధ్యత అయితే పరీక్షలకు సిద్ధం కావడం నిరుద్యోగుల బాధ్యత అని స్పష్టం చేశారు.

### కుటుంబ పాలన... ప్రజా పాలన

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ సభ్యులకు పదవులు దక్కాయని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు, వినోద్‌రావులకు వివిధ పదవులు దక్కాయని ప్రస్తావించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ వంటి నేతలకు మంత్రి పదవులు ఇచ్చానని చెప్పారు. కావ్యను ఎంపీగా, యశస్వినిని ఎమ్మెల్యేగా చేశామని, ఉద్యమకారుడు కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చామని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబానికి లాభం జరిగితే.. కాంగ్రెస్ ప్రజలకు లాభం చేసే పాలన అందిస్తోందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించిన ఆయన, 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను రెట్టింపు మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎన్ని రాజకీయ సవాళ్లు ఎదురైనా తాను వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు.

### కేసీఆర్ అసెంబ్లీకి రావాలి: రేవంత్

సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు కూడా అసెంబ్లీకి వచ్చి బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చించాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ అనుభవం, సలహాలు తమకు అవసరమని చెప్పారు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే రాష్ట్ర ఆదాయం సరిపోతోందని, తాము రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని రేవంత్ అన్నారు. పరకాలలో రూ.484 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సీఎం.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు అహర్నిశలు పనిచేస్తున్నామని తెలిపారు. తెలంగాణ కోసం యువత ఆత్మబలిదానాలు చేసిందని, ఉద్యమ సమయంలో కేసీఆర్ కుటుంబం యువతను రెచ్చగొట్టిందని విమర్శించారు. నిరుద్యోగులు ధర్నాలు, ర్యాలీలతో సమయం వృథా చేసుకోవద్దని, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. కేసీఆర్ 'ఫ్యామిలీ జస్టిస్' చేస్తే తాను 'సోషల్ జస్టిస్' చేస్తున్నానని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎం అయితే కుటుంబానికే లాభం.. తాను సీఎం అయితే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని రేవంత్ స్పష్టం చేశారు.



# ములుగు అభివృద్ధిపై రేవంత్ కీలక ప్రకటన

మేడారం సమ్మక్క-సారక్క ప్రాంగణాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశామని చెప్పారు. ములుగు ప్రాంత అభివృద్ధికి సాగునీరు అత్యంత కీలకమని, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మల్లూరు నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని, జంపన్నవాగును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

### ఆదివాసీ యువతకు నైపుణ్యమే ఆయుధం

ఆదివాసీ బిడ్డలు కష్టానికి మారుపేరని రేవంత్ రెడ్డి అన్నారు. వారి కష్టాలు తొలగాలంటే సాగునీరు, విద్య, ఉపాధి అవకాశాలు పెరగాలని పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యపై దృష్టి పెట్టడంతో పాటు, ఆ తర్వాత నైపుణ్య విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యం కలిగితే జపాన్, జర్మనీ వంటి దేశాల్లోనూ అవకాశాలు పొందవచ్చన్నారు. మహిళల కోసం ఇందిరమ్మ చీరలను సారెగా అందిస్తున్నామని, ఈ ఏడాది చిలకపచ్చ రంగు చీరలు పంపిణీ చేస్తామని తెలిపారు. రక్తసంబంధం లేకపోయినా సీతక్కను ఆడబిడ్డగా గౌరవిస్తున్నానని చెబుతూ ప్రత్యర్థులపై విమర్శలు చేశారు. రక్తసంబంధం ఉన్న సోదరినే ఆస్తి కోసం ఇంటి నుంచి పంపించారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు మంచి జరగాలని కోరుకునే ప్రభుత్వం తమదేనని, ప్రజలు అండగా నిలిస్తే రాష్ట్రాన్ని తామే అభివృద్ధి చేసుకుంటామని రేవంత్ పిలుపునిచ్చారు.

# నేను ఎక్కడికీ పోను.. ఖమ్మం గడ్డ వదలను

### మంత్రి తుమ్మలపై పువ్వాడ విమర్శలు

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎక్కడికీ వెళ్లబోనని, ఖమ్మం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. తనపై వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. నాలుగు దశాబ్దాలుగా పువ్వాడ కుటుంబానికి ఖమ్మంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన పువ్వాడ.. తుమ్మల ఏ పార్టీలో ఉన్నా మంత్రి పదవులు అనుభవించారని, ఖమ్మం అభివృద్ధికి మాత్రం చెప్పుకునే స్థాయిలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరూ చేయని పనులను తానే చేశానని చెప్పుకోవడం తప్ప ఖమ్మానికి తుమ్మల చేసిందేమీ లేదని ఆరోపించారు.

### కళ్యాణలక్ష్మిపై కాంగ్రెస్ కుట్ర

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని పువ్వాడ తప్పుబట్టారు. హైకోర్టులో పిల్ దాఖలైన అంశంలో ప్రభుత్వం సరైన కౌంటర్ ఇవ్వకుండా వ్యవహరించిందని ఆరోపించారు. కేసీఆర్ పేరు గుర్తుకు వస్తుందనే కారణంతో పేద ఆడబిడ్డలకు అండగా ఉన్న కళ్యాణలక్ష్మిని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఒక ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను మరో ప్రభుత్వం కొనసాగించడం సాధారణ విషయమన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించలేదా అని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో నాణ్యతా లోపాలు కనిపిస్తున్నాయని, నిర్మాణం పూర్తయిన ఏడాదికే సీసీ లైనింగ్ దెబ్బతినడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు.

### ఖమ్మం అభివృద్ధిపై లెక్కలు

తుమ్మల నాగేశ్వరరావు, ఆయన అనుచరులు ఇసుక, మట్టి, భూ వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని పువ్వాడ ఆరోపించారు. మున్నేరు తీగల వంతెన, రక్షణ గోడలు, ఇంజినీరింగ్ కాలేజీ, ఖమ్మం బస్‌స్టాండ్, గోళ్లపాడు చానల్ అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. దేవరపల్లి-ఖమ్మం జాతీయ రహదారికి తుమ్మల క్రెడిట్ తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. హైవేపై వరుస ప్రమాదాలు జరుగుతున్నా ప్రజల భద్రతపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. 2029 ఎన్నికల్లో ఖమ్మం నుంచే తన రాజకీయ పోరాటం కొనసాగుతుందని పువ్వాడ మరోసారి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు పార్టీతోనే ఉన్నారని, వారిని కాపాడుకుంటామని చెప్పారు. రేవంత్‌రెడ్డి పాలనను అట్టర్ ఫ్లాప్ సినిమాతో పోల్చుతూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# మింగ మెతుకు లేదు..

- మీసాలకు సంపెంగ నూనె!
- రూ.100 కోట్ల ప్రజాధనం వృథా
- స్మార్ట్ కార్డులపై దాసోజు శ్రవణ్ ఫైర్

స్మార్ట్ రేషన్ కార్డుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఇప్పటికే ఉన్న ఈరేషన్ కార్డులను రద్దు చేసి 1.05 కోట్ల కొత్త లామినేటెడ్ కార్డుల ముద్రణ, లామినేషన్, రవాణా కోసం సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. కార్డులపై సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ముద్రించడాన్ని ఆయన తప్పుబట్టారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగుల పెన్షన్లు, గ్రాట్యుటీ బకాయిలకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం తన ప్రచారం కోసం మాత్రం వందల కోట్లు ఖర్చు చేయడం 'మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె' అన్నట్లుందని ఎద్దేవా చేశారు. రేషన్ కార్డు పేదల హక్కు అని, అది సీఎం లేదా మంత్రి వ్యక్తిగతంగా ఇచ్చే దానం కాదని స్పష్టం చేశారు.

### ఫొటోలపై నిబంధనల ప్రశ్నలు

రేషన్ కార్డులను రాజకీయ ప్రచార సాధనాలుగా మార్చారని శ్రవణ్ మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారిక పత్రాలపై సీఎం ఫొటో పెట్టాలన్న సూచనలను తిరస్కరించిందని గుర్తుచేశారు. 2021లో కొవిడ్ టీకా సర్టిఫికెట్లపై ప్రధాని మోదీ ఫొటోను కాంగ్రెస్ వ్యతిరేకించిందని, ఇప్పుడు అదే కాంగ్రెస్ రేషన్ కార్డులపై సీఎం, మంత్రి ఫొటోలు ముద్రించడం ద్వంద్వ వైఖరి కాదా? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా మంత్రి ఫొటో ముద్రించారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ వస్తే కార్డుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తూ, ఫొటోలు తొలగించాల్సి వస్తే మళ్లీ ప్రజాధనంతో ముద్రిస్తారా అని నిలదీశారు. కార్డులపై రాజకీయ నేతల ఫొటోలు తొలగించి అధికారిక రాజముద్రతో కార్డులు ఇవ్వాలని, రూ.100 కోట్ల ఖర్చుపై కాగ్‌తో ఆడిట్ చేయించాలని శ్రవణ్ డిమాండ్ చేశారు.

# కార్డులు-ఫొటోలు.. రాజకీయ రగడ

## రేషన్ కార్డులపై ఫొటోలెందుకు?

### రేవంత్ సర్కార్‌పై సునీత ఫైర్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అబద్ధాలతో కూడుకున్నవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆమె మాట్లాడుతూ ప్రజాధనంతో సభలు నిర్వహించి కేసీఆర్, హరీశ్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేయడం తప్ప రాష్ట్రాభివృద్ధిపై సీఎం స్పష్టమైన ప్రణాళిక చెప్పలేదని ఆరోపించారు. మిషన్ భగీరథ ద్వారా కేసీఆర్ ఇంటింటికీ తాగునీరు అందించారని, దాన్ని నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్ ప్రభుత్వానిదేనన్నారు. రేషన్ కార్డుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 6.47 లక్షల రేషన్ కార్డులు ఇచ్చినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాసనమండలిలోనే చెప్పారని గుర్తుచేశారు. రేషన్ కార్డులపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ ఫొటోలు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. సన్నబియ్యం పంపిణీ తమ ఘనత కాదని, దానికి కేసీఆర్ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు.

### రైతులు, నిరుద్యోగులపై ప్రశ్నలు

రైతులకు 12 గంటల విద్యుత్ కూడా అందడం లేదని ఆరోపించిన సునీతా లక్ష్మారెడ్డి, రైతు రుణమాఫీ, రైతుభరోసా, బోనస్ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. యూరియా యాప్‌తో రైతుల కష్టాలు పెరిగాయని అన్నారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిగాచి ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రకటించిన పరిహారం ఇంకా అందలేదని ఆరోపించారు. సంగారెడ్డికి వచ్చిన సీఎం జిల్లాకు నిధులు ఇవ్వకుండా వ్యక్తిగత విమర్శలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. కళ్యాణలక్ష్మిని ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. హరీశ్‌రావుపై సీఎం చేసిన క్షుద్ర పూజల వ్యాఖ్యలను కూడా ఆమె తప్పుబట్టారు. సీఎం హోదాలో ఇలాంటి మాటలు సరికావని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు భరోసా

- కళ్యాణలక్ష్మిపై బీఆర్ఎస్ సమరం
- రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు
- రద్దుపై కాంగ్రెస్‌కు కేటీఆర్ వార్నింగ్



కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపి పేదింటి ఆడబిడ్డలకు అందుతున్న ఆర్థిక భరోసాను తొలగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించిందని గుర్తుచేశారు. రూ.51 వేలతో మొదలైన సాయం రూ.75,116కు, తర్వాత రూ.1,00,116కు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో సుమారు 13 లక్షల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర సాయం అందిందని తెలిపారు. కోవిడ్ సమయంలోనూ పథకం కొనసాగిందని చెప్పారు.

### కౌంటర్ ఎందుకు వేయలేదు?

కళ్యాణలక్ష్మి అంశంలో హైకోర్టుకు ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కేటీఆర్ తీవ్రంగా ప్రశ్నించారు. నాలుగుసార్లు గడువు ఇచ్చినా కౌంటర్ ఎందుకు వేయలేదని నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రులకు సంబంధించిన వివిధ కేసుల్లో ప్రైవేటు న్యాయవాదులకు భారీగా ఖర్చు చేసే ప్రభుత్వం.. పేద ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన అంశంలో ఎందుకు సరైన న్యాయపోరాటం చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీపై ఆడబిడ్డలు ప్రశ్నిస్తుండటంతో పథకాన్నే ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. పెళ్లిళ్లు పూర్తయినా సాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కేవలం సంక్షేమ పథకాలు కాదని, పేద కుటుంబాల ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ఆర్థిక భరోసాకు ప్రతీకలని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు ఉద్యమించాలన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన దరఖాస్తులన్నింటినీ వెంటనే పరిష్కరించి ఆర్థిక సాయం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బీసీల లెక్క తేల్చాల్సిందే!

- కులగణనలో ప్రత్యేక స్థానం కావాలి
- కేంద్రానికి పొన్నం ప్రభాకర్ డిమాండ్



### మోదీకి లేఖ.. ప్రత్యేక కేటగిరీకి డిమాండ్

2027 జనాభా లెక్కల్లో ఓబీసీ/ఎస్ఈబీసీలకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీ, ఎస్ఈబీసీలకు ప్రత్యేక కేటగిరీ, రాష్ట్రాల వారీగా మాస్టర్ కుల డైరెక్టరీ, ప్రతి కులానికి ప్రత్యేక డిజిటల్ కోడ్ ఏర్పాటు చేయాలని కోరారు. 2011 సామాజిక, ఆర్థిక, కుల గణనలో ఎదురైన కులాల పేర్లు, స్పెల్లింగ్‌లు, ఉపకులాల సమస్యలు మళ్లీ తలెత్తకుండా ప్రమాణీకృత విధానం అమలు చేయాలని సూచించారు. తెలంగాణలో నిర్వహించిన సీపెక్ సర్వే అనుభవాన్ని 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. బీసీల వాస్తవ జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన సమాచారం ఉంటేనే రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమం, సమాన ప్రాతినిధ్యంపై సమర్థవంతమైన విధానాలు రూపొందించగలమని మంత్రి స్పష్టం చేశారు.

# నగరంలో ఈ-ఆటోల పరుగులు

### ఆటోలకు ఎలక్ట్రిక్ టర్న్ • 18,766 ఆటోలకు కొత్త రూపం

హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, సుస్థిరమైన, పర్యావరణహిత ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ మార్పిడి పథకం-2026'ను అమలు చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047కు అనుగుణంగా రూపొందించిన ఈ పథకానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. క్యూర్ పరిధిలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్‌తో నడుస్తున్న 18,766 ఆటోలను దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఇందులో 11,254 డీజిల్, 7,512 పెట్రోల్ ఆటోలు ఉన్నాయని వివరించారు. కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆటో డ్రైవర్లపై ఇంధన ఖర్చు భారాన్ని తగ్గించేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు.

### రూ.1.50 లక్షల వరకు సాయం

1అర్హత ఉన్న ప్రతి ఆటో యజమానికి ప్రభుత్వం రెండు అవకాశాలు కల్పిస్తుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుత ఆటోను AIS-123 ప్రమాణాలకు అనుగుణంగా ఆమోదిత ఎలక్ట్రిక్ కిట్‌తో రెట్రోఫిట్ చేసుకోవచ్చు. లేదా పాత ఆటోను ప్రభుత్వానికి అప్పగించి కొత్త ఎలక్ట్రిక్ ఆటోను కొనుగోలు చేసుకోవచ్చు. ఈ రెండు విధానాల్లోనూ ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. పథకం అమలుకు రూ.200 కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్నట్లు తెలిపారు. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా CURE ప్రాంతంలో అర్హత కలిగిన ఆటో యజమానులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెంచడం ద్వారా హైదరాబాద్‌లో వాయు కాలుష్యం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు.

# పదేళ్ల పాలనపై ప్రశ్నల వర్షం

## కేసీఆర్ పాలనకు మీ పిల్లలే రిపోర్టు కార్డ్

### బీఆర్ఎస్ పాలనపై బండి సంజయ్ ఫైర్



బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యుల వ్యాఖ్యలనే ఆ పార్టీ పాలనకు రిపోర్టు కార్డుగా అభివర్ణించారు. "కేసీఆర్ పాలనకు మీ పిల్లలే రిపోర్టు కార్డు ఇస్తున్నారు" అంటూ బీఆర్ఎస్‌పై సెటైర్లు వేశారు. అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణలో మంచి పాఠశాలలు, కళాశాలలు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత ఎందుకు ఏర్పడింది? యూనివర్సిటీల్లో ఖాళీలు ఎందుకు భర్తీ చేయలేదు? పేపర్ లీకులు ఎందుకు జరిగాయి? ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో ఎందుకు చెల్లించలేదని నిలదీశారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్యలు, విద్యా సంస్థలకు నిధుల కొరతపై పదేళ్ల పాలనలో ఎందుకు చర్యలు తీసుకోలేదని బండి సంజయ్ ప్రశ్నించారు.

### 'సోర్ గ్రేప్స్' అంటూ ఎద్దేవా


అధికారంలో ఉన్నప్పుడు విద్యావ్యవస్థను బలోపేతం చేయకుండా, అధికారం కోల్పోయిన తర్వాత దేశంలో మంచి కళాశాలలు లేవని చెప్పడం 'సోర్ గ్రేప్స్' ధోరణేనని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థుల పిల్లలు ఏం చదువుతున్నారో, వారి ఫోన్లను ట్యాప్ చేయడంపై దృష్టి పెట్టే బదులు సొంత పిల్లల మాటలు విని ఉంటే విద్యా వ్యవస్థ మెరుగుపడేదని ఎద్దేవా చేశారు. భారత్ కంటే శ్రీలంక గొప్పదనే అభిప్రాయాలను కూడా ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భారతదేశాన్ని తక్కువ చేసి మాట్లాడటం దేశభక్తి కాదన్నారు. కాంగ్రెస్ వందేమాతరంపై వివాదానికి దారితీస్తోందని, బీఆర్ఎస్ దేశంలోని విద్యా వ్యవస్థపై విమర్శలు చేస్తోందని ప్రస్తావించారు. తనకు జాతీయత రాజకీయ అంశం కాదని, జీవితకాల నమ్మకమని స్పష్టం చేశారు. కాషాయ జెండా, త్రివర్ణ పతాకాన్ని గర్వంగా ధరిస్తానని, దేశం కోసం అవసరమైతే తన రక్తాన్ని సైతం ఇస్తానని బండి సంజయ్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

### 'నేషన్ ఫస్ట్' అంటూ స్పష్టత

భారత్ మాతాకీ జై అంటూ జీవితాంతం పనిచేసిన కార్యకర్తకు దేశం అంటే కేవలం రాజకీయ నినాదం కాదని బండి సంజయ్ పేర్కొన్నారు. దేశమే ముందు.. ఎప్పుడూ దేశమే ముందు అనే సందేశంతో తన ట్వీట్‌ను ముగించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విద్యారంగం, యూనివర్సిటీలు, ఉపాధి అవకాశాల విషయంలో తీసుకున్న నిర్ణయాలను ప్రజలు పరిశీలించాలని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు పరిష్కరించాల్సిన సమస్యలను పట్టించుకోకుండా, ఇప్పుడు వాటిపై విమర్శలు చేయడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల విద్యా వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సొంత ఇంటి నుంచే బీఆర్ఎస్ పాలనపై ప్రశ్నలు వస్తున్నాయంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీశాయి.

# వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్

### నూతన వధూవరులకు ఆశీస్సులు



షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్ కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే శంకర్‌ను పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. వివాహ వేడుక ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగింది. కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నందిగామ మండల అధ్యక్షుడు కుమార్ గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్, కేకే కృష్ణ, లింగారెడ్డిగూడ ఉపసర్పంచ్ అశోక్, సీతారాం, నాని, వీర్లపల్లి సాజిత్, గుట్ట రాజు, కిట్టు, తీగాపూర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వివాహ వేడుకలో పాల్గొన్న అతిథులతో ఎమ్మెల్యే శంకర్ ఆత్మీయంగా మాట్లాడారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరం



శేర్లింగంపల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ నెల 18న ప్రతి డివిజన్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు. నిరుపేద మహిళలకు ఉపయోగపడే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు సక్రమంగా అందడం లేదని, పింఛన్ల విషయంలోనూ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. గర్భిణులకు కేసీఆర్ కిట్లు అందడం లేదని, ప్రభుత్వ భూములను వేలం వేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆ మాటను పక్కన పెట్టారని కృష్ణారావు ఆరోపించారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి డివిజన్‌లో పెద్దఎత్తున నిరసనలు నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు.




## విశాఖపట్నం విమానాశ్రయం
# మూత ఎందుకు?

- భోగాపురానికి మారిన విమాన సేవలు..
- ఐఎన్ఎస్ డేగలో ఏంమ కొనసాగనుంది?
- 30 ఏళ్ల సివిల్ కార్యకలాపాలకు ముగింపు

విశాఖపట్నం విమానాశ్రయం (ఐఎన్ఎస్ డేగ సివిల్ ఎన్‌క్లేవ్) ఆదివారం రాత్రి తన వాణిజ్య విమాన సేవలకు ముగింపు పలికింది. చివరి షెడ్యూల్ విమానంగా ఇండిగో 6E 2018... రాత్రి 10.45కి ఢిల్లీకి బయలుదేరిన సర్వీస్... టేకాఫ్ కావడంతో ఈ చారిత్రక ఎయిర్‌పోర్ట్‌లో సివిల్ ఆపరేషన్లు పూర్తిగా ఆగిపోయాయి. 1940లలో యుద్ధకాలంలో ప్రారంభమైన ఈ ఎయిర్‌ఫీల్డ్, దశాబ్దాల పాటు నగరానికి ప్రధాన విమాన ద్వారంగా సేవలందించింది.

### భోగాపురానికి పూర్తిగా మారిన విమాన సేవలు

సోమవారం... ఆగస్టు 17, 2026 అర్ధరాత్రి 12.01 గంటల నుంచి అన్ని షెడ్యూల్ విమానాలు భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నడుస్తాయి. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ జారీ చేసిన రెండు గెజిట్ నోటిఫికేషన్ల ప్రకారం ఈ మార్పు అమల్లోకి వచ్చింది. ఒక నోటిఫికేషన్ కొత్త విమానాశ్రయాన్ని ప్రారంభించగా, మరొకటి ఐఎన్ఎస్ డేగలోని సివిల్ కార్యకలాపాలను ముగించింది. ఇకపై ఇక్కడ కేవలం సైనిక విమానాలు, అత్యవసర సేవలు మరియు ప్రత్యేక అనుమతుల విమానాలు మాత్రమే కొనసాగుతాయి.

### యుద్ధకాలం నుంచి ఆధునిక హబ్

ఐఎన్ఎస్ డేగ ఒక నావికాదళ స్థావరం కావడంతో, సివిల్ విమానాలకు పరిమిత స్లాట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి ఇది పెద్ద అడ్డంకిగా మారింది. 2016లోనే భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతి ఇవ్వడం వెనుక ప్రధాన కారణం ఇదే. రోజువారీ విమానాల సంఖ్య పెరగడంతో పాటు అంతర్జాతీయ కనెక్టివిటీ విస్తరించాలంటే ప్రత్యేక సివిల్ విమానాశ్రయం అవసరమని ప్రభుత్వం భావించింది. 1941లో రాయల్ ఎయిర్ ఫోర్స్ ఏర్పాటు చేసిన ఈ ఎయిర్‌ఫీల్డ్, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కీలక పాత్ర పోషించింది. తరువాత భారత వైమానిక దళం కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. 1954 నుంచి సివిల్ విమానాలు ప్రారంభమవగా, 1991లో ఇది అధికారికంగా ఐఎన్ఎస్ డేగగా నావికాదళం ఆధీనంలోకి వెళ్లింది. అయినప్పటికీ ఏఏఐ నిర్వహణలో సివిల్ ఎన్‌క్లేవ్ కొనసాగింది.

### భోగాపురం వైపు మార్పు

2009లో కొత్త టెర్మినల్ ప్రారంభం తర్వాత విశాఖ విమానాశ్రయం వేగంగా అభివృద్ధి చెందింది. 2012లో అంతర్జాతీయ హోదా పొందింది. సింగపూర్, దుబాయ్, బ్యాంకాక్ వంటి గమ్యస్థానాలకు నేరుగా విమానాలు నడిచాయి. 2024-25లో దాదాపు 29 లక్షల ప్రయాణికులతో ఇది ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత రద్దీగా ఉన్న విమానాశ్రయంగా నిలిచింది. భోగాపురం విమానాశ్రయం 3,800 మీటర్ల రన్‌వే, 18 ఎయిర్‌క్రాఫ్ట్ స్టాండ్లతో నిర్మించబడింది. మొదటి దశలోనే 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యం కలిగి ఉంది. విశాఖపట్నం నుంచి సుమారు 40-48 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కొత్త విమానాశ్రయం ద్వారా అంతర్జాతీయ కనెక్టివిటీ మరింత విస్తరించనుంది.

### ఐఎన్ఎస్ డేగలో ఏం కొనసాగుతుంది?

సివిల్ విమానాలు ఆగిపోయినప్పటికీ ఐఎన్ఎస్ డేగ పూర్తిగా మూసివేయబడలేదు. నావికాదళం ఇక్కడ తన అన్ని కార్యకలాపాలను కొనసాగిస్తుంది. పేట్రోల్, యాంటీసబ్‌మెరైన్, రెస్క్యూ మరియు శిక్షణ విమానాలు కొనసాగుతాయి. భవిష్యత్తులో రఫేల్ M యుద్ధ విమానాల మోహరింపు కూడా ఈ స్థావరంలో జరగనుంది. విశాఖపట్నం విమానాశ్రయం మూసివేతతో ఒక చారిత్రక అధ్యాయం ముగిసింది. యుద్ధకాలం నుంచి ఆధునిక విమానయాన కేంద్రంగా ఎదిగిన ఈ ఎయిర్‌ఫీల్డ్ ఇప్పుడు పూర్తిగా సైనిక అవసరాలకు పరిమితమైంది. ఇక నగరానికి కొత్త గగనద్వారంగా భోగాపురం విమానాశ్రయం సేవలు అందించనుంది.

# పెళ్లి పందిరిలో పగల మంటలు!

- తాడిపత్రిలో జేసీ రచ్చపై దుమారం
- వేడుకలో మొదలైన రాజకీయ వేడి

తాడిపత్రి రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీడీపీ సీనియర్ నేత సంజీవరెడ్డి కుమారుడి వివాహ వేడుకలో జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పెళ్లికి హాజరైన జేసీకి సంజీవరెడ్డి సోదరుడు శ్రీరాం రెడ్డి కనిపించడంతో వివాదం మొదలైనట్లు సమాచారం. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ నాయకుడైన శ్రీరాం రెడ్డిని ఉద్దేశించి “ఇక్కడికి ఎందుకు వచ్చావు?” అంటూ జేసీ ప్రశ్నించినట్లు తెలిసింది. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఇది తన అన్న కుమారుడి పెళ్లి అని శ్రీరాం రెడ్డి చెప్పినా వివాదం సద్దుమణగలేదని సమాచారం. వైసీపీ నేత కందిగోపుల మురళి శ్రీరాం రెడ్డికి మద్దతుగా నిలవడంతో మాటామాటా పెరిగినట్లు తెలుస్తోంది. దీంతో పెళ్లికి వచ్చిన బంధువులు, అతిథులు ఏం జరుగుతుందో అర్థంకాక ఆందోళనకు గురయ్యారు.

### కారు ధ్వంసంతో మరింత ఉద్రిక్తత

జేసీ ప్రభాకర్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత కూడా వివాదం కొనసాగినట్లు సమాచారం. జేసీ అనుచరులు ఫంక్షన్ హాల్‌కు చేరుకుని ఓ కారును ధ్వంసం చేసినట్లు ఆరోపణలు రావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పెళ్లి వేడుకలో ఉండాల్సిన సందడి కాస్తా భయాందోళనగా మారిందని ప్రత్యక్షంగా ఉన్నవారు చెబుతున్నారు. రాజకీయ ప్రత్యర్థిత్వం ఉన్నా కుటుంబ వేడుకలను వివాదాలకు దూరంగా ఉంచాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే వివాహ వేడుకకు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కూడా హాజరయ్యారు. ఆయన సమక్షంలోనే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం రాజకీయంగా మరింత చర్చకు దారితీసింది. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

### తాడిపత్రిలో మళ్లీ రాజకీయ సెగలు

తాడిపత్రి రాజకీయాలకు దూకుడు, ఆధిపత్య పోరాటం కొత్తేమీ కాదు. జేసీ కుటుంబ రాజకీయ శైలి కూడా తరచూ చర్చలో ఉంటుంది. అయితే రాజకీయ విభేదాలు వ్యక్తిగత వేడుకల వరకు చేరడం సరికాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెళ్లి పందిరిలో జరిగిన ఈ ఘటనతో తాడిపత్రిలో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. ప్రత్యర్థుల మధ్య విభేదాలు రాజకీయ వేదికలపైనే వ్యక్తం కావాలని, కుటుంబ కార్యక్రమాలకు వాటిని తీసుకురావద్దని పలువురు సూచిస్తున్నారు. పెళ్లికి వచ్చిన సామాన్యులు, బంధువులు రాజకీయ రచ్చకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎందుకు రావాలనే ప్రశ్న ఇప్పుడు స్థానికంగా వినిపిస్తోంది. దీంతో తాడిపత్రిలో ఎప్పటి నుంచో కొనసాగుతున్న రాజకీయ వేడి మరోసారి చర్చనీయాంశమైంది.



# కేబీఆర్ ట్రాఫిక్‌కు భారీ ఊరట

- వన్‌వేతో మారనున్న రూట్లు..
- ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లతో పరిష్కారం
- రూ.1,090 కోట్లతో భారీ ప్రాజెక్టు





హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సిటీ ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న కీలక జంక్షన్లలో రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో 7 మల్టీ లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్లు, 7 డైరెక్షనల్ అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. మొత్తం 14 నిర్మాణాలతో కేబీఆర్ కారిడార్‌ను సిగ్నల్ రహితంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్నారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేందుకు ఈ నెల 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయనున్నారు. రెండు విడతల ట్రయల్ రన్స్ నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ తెలిపారు. వాహనదారులకు తొలి రోజుల్లో కొంత ఇబ్బంది ఎదురైనా, భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

### ఫ్లైఓవర్లు.. అండర్‌పాస్‌లతో సిగ్నల్ ఫ్రీ

హెచ్‌సిటీ ప్రాజెక్టును 24 నెలల కాలపరిమితితో చేపడుతున్నారు. కేబీఆర్ పరిసరాల్లోని ఆరు ప్రధాన జంక్షన్లను రెండు ప్యాకేజీలుగా అభివృద్ధి చేస్తున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్, ముగ్ధ జంక్షన్ ఒక ప్యాకేజీలో ఉండగా.. రోడ్ నంబర్ 45, ఫిలింనగర్, మహారాజా అగ్రసేన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్లు మరో ప్యాకేజీలో ఉన్నాయి. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ ఎంట్రెన్స్ ప్రాంతాల్లో కీలకమైన అండర్‌పాస్‌లు, స్టీల్ ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు. రోడ్ నంబర్ 45, ఫిలింనగర్, మహారాజా అగ్రసేన్, బసవతారకం జంక్షన్లలోనూ నేరుగా వెళ్లే ట్రాఫిక్‌కు అండర్‌పాస్‌లు, రైట్ టర్నింగ్ వాహనాలకు ఫ్లైఓవర్లు ఏర్పాటు చేస్తారు. దీంతో ఒక్కో దిశలోని వాహన ప్రవాహాన్ని విడదీసి రద్దీ తగ్గించనున్నారు.

### జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ టాప్

కేబీఆర్ కారిడార్‌లో ట్రాఫిక్ తీవ్రత ఎంత ఉందో పీక్ అవర్ గణాంకాలు చెబుతున్నాయి. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద గంటకు 15,321 పీసీయూల రద్దీ నమోదవుతోంది. కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్‌లో 13,516 పీసీయూలతో రెండోస్థానంలో ఉంది. మహారాజా అగ్రసేన్ జంక్షన్‌లో 10,356, రోడ్ నంబర్ 45 వద్ద 9,966, ఫిలింనగర్‌లో 9,605, బసవతారకం జంక్షన్‌లో 5,880 పీసీయూల ట్రాఫిక్ నమోదవుతోంది. హెచ్‌సిటీ పనులు పూర్తయితే కేబీఆర్ ఎంట్రెన్స్, రోడ్ నంబర్ 45, ఫిలింనగర్, మహారాజా అగ్రసేన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్లలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని సజ్జనార్ తెలిపారు. అత్యంత రద్దీగా ఉండే జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద సుమారు 80 శాతం ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని చెప్పారు.


### ఇంధనం ఆదా.. కాలుష్యానికి చెక్

సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోయే సమయం తగ్గడంతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ఇంధన వినియోగం తగ్గడంతో ప్రజలకు ఆర్థిక ప్రయోజనం కలగడంతో పాటు కేబీఆర్ పరిసరాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు.

కోర్ సిటీ నుంచి ఐటీ కారిడార్ వైపు ప్రయాణించే వారికి ఈ ప్రాజెక్టు పెద్ద ఊరటగా మారనుంది. నిర్మాణ పనుల సమయంలో వన్‌వే కారణంగా రూట్లు మార్చుకోవాల్సి రావడంతో వాహనదారులకు కొంత ఇబ్బంది తప్పదు. అయితే ఈ తాత్కాలిక అసౌకర్యం భవిష్యత్‌లో సిగ్నల్ రహిత, వేగవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తుందని పోలీసులు చెబుతున్నారు. నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని, నగరవాసులు సహకరించాలని సజ్జనర్ విజ్ఞప్తి చేశారు.

# వందేమాతరం వివాదం

- కాంగ్రెస్‌పై అమిత్ షా ఆరోపణలు
- మధ్యలోనే ఆపేశారంటూ విమర్శలు



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం గీతాన్ని మధ్యలోనే ఆపేశారంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో జరిగిన సభలో మాట్లాడిన ఆయన.. వందేమాతరం వంటి జాతీయ గీతాన్ని పూర్తి కాకముందే ఆపడం దేశభక్తిని అవమానించడమేనని అన్నారు. గీతం కొనసాగుతుండగా సోనియా గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు దానిని ఆపాలని సూచించినట్లు ఆరోపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వేలాది మంది ప్రాణత్యాగాలు చేసిన చరిత్రను కాంగ్రెస్ మరిచిపోయిందని మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా జాతీయ భావనలకు కాంగ్రెస్ దూరమైందని విమర్శించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ, దేశ ప్రజలు ఈ చర్యను ఎప్పటికీ క్షమించరని అమిత్ షా వ్యాఖ్యానించారు.

### కాంగ్రెస్ ఖండన.. మరో వివాదం

అమిత్ షా ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. పార్టీ అధికార ప్రతినిధి ఉదిత్ రాజ్ మాట్లాడుతూ.. సోనియా గాంధీ వందేమాతరం గీతాన్ని ఆపాలని సూచించలేదని, అనారోగ్యంతో ఎక్కువసేపు నిలబడలేని ఖర్గే కోసం కుర్చీ ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సంకేతం ఇచ్చారని వివరణ ఇచ్చారు. బీజేపీ కావాలనే తప్పుడు వివాదాన్ని సృష్టిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ఎస్ గత చరిత్రను ప్రస్తావిస్తూ, జాతీయ జెండాను ఎన్నో ఏళ్ల పాటు ఎగురవేయలేదన్న విమర్శలకు అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో వందేమాతరం అంశం మరోసారి బీజేపీ-కాంగ్రెస్ మధ్య రాజకీయ మాటల యుద్ధానికి కేంద్రంగా మారింది.

# దిమాగీ నక్సల్ రగడ

- మోదీ వ్యాఖ్యలకు చిదంబరం షాకింగ్ రిప్లై
- గర్వంగా చెబుతున్నానంటూ చిద్దూ కౌంటర్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ‘దిమాగీ నక్సల్’ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని ప్రభుత్వం అణచివేసిందని చెబుతూనే, మావోయిస్టు భావజాలం ఉన్న కొందరు వ్యవస్థలో కీలక స్థానాల్లోకి చొరబడి విధానాలను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారని మోదీ ఆరోపించారు. ప్రభుత్వ కమిటీల్లో సలహాదారులుగా పనిచేస్తూ తమ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. ఈ సవాలును తక్కువగా అంచనా వేయకూడదని ప్రజలను అప్రమత్తం చేసిన ప్రధాని.. ఇలాంటి శక్తులను గుర్తించి ఒంటరి చేయాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల నక్సలిజం కారణంగా లక్షలాది యువత భవిష్యత్తు దెబ్బతిందని, హింసలో 3,500 మందికి పైగా పోలీసులు, భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు.

### నేను గర్వంగా దిమాగీ నక్సల్

మోదీ వ్యాఖ్యలకు కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ఘాటుగా స్పందించారు. ఆదివారం సోషల్ మీడియా వేదికగా “నేను దిమాగీ నక్సల్‌గా ఉన్నందుకు గర్వపడుతున్నాను” అంటూ వ్యంగ్యంగా కౌంటర్ ఇచ్చారు. మోదీ ఉపయోగించిన పదాన్ని తనపైకి తిప్పుతూ చిదంబరం ఈ వ్యాఖ్య చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడం నేరం కాదనే భావనను ఆయన వ్యాఖ్యల్లో వ్యక్తం చేశారు. దీంతో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలకు చిదంబరం స్పందన మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

### నక్సలిజంపై మోదీ ప్రభుత్వ వాదన

2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత నక్సలిజం నిర్మూలనకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని ప్రధాని మోదీ చెప్పారు. ఒకప్పుడు నక్సలైట్ల తుపాకీ శబ్దాలు వినిపించిన ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి, విశ్వాసం, ప్రజా భాగస్వామ్యానికి ప్రతీకగా త్రివర్ణ పతాకం ఎగురుతోందని పేర్కొన్నారు. నక్సలిజం, మావోయిజం లక్షలాది యువత కలలను నాశనం చేశాయని మోదీ అన్నారు. అడవుల్లో సాయుధ నక్సలిజం తగ్గినా, దాని భావజాలాన్ని వ్యవస్థలో కొనసాగించేందుకు ప్రయత్నించే శక్తులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేయగా, చిదంబరం కౌంటర్‌తో బీజేపీ-కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.

# రాహుల్ ఆస్తుల కేసు

- నేడు సుప్రీంకోర్టులో విచారణ
- అలహాబాద్ హైకోర్టు ఆదేశాలపై సవాల్



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సంబంధించిన ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసు మరో కీలక మలుపు తిరిగింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం, ఆగస్టు 17న విచారణ చేపట్టనుంది. సుప్రీంకోర్టు తాజా కారణాల జాబితా ప్రకారం ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి.మోహనా సభ్యులుగా ఉన్న ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై సీబీఐ, ఈడీ దర్యాప్తు పురోగతిని పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. జూలై 20న లక్నో బెంచ్ సీబీఐ సమర్పించిన నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంబంధిత సీనియర్ అధికారి స్వయంగా తాజా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది.

### దర్యాప్తు పురోగతిపై హైకోర్టు అసంతృప్తి

కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త ఎస్.విగ్నేష్ శిశిర్ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఈ వ్యవహారం కొనసాగుతోంది. రాహుల్ గాంధీ ఆస్తులకు సంబంధించి చేసిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు పురోగతిని సమగ్రంగా వివరించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. దర్యాప్తులో అక్రమాలకు సంబంధించిన ఆధారాలు, పత్రాలు ఈడీకి లభిస్తే చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. సీబీఐ యాంటీ కరప్షన్ విభాగం జాయింట్ డైరెక్టర్ లేదా సంబంధిత జోన్ అధిపతి తాజా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వంలోని పలు శాఖలకు నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని చెప్పింది. కేసు రికార్డులను సీల్డ్ కవర్‌లోనే భద్రపరచాలని ఆదేశించింది. ఇప్పుడు సుప్రీంకోర్టు హైకోర్టు ఆదేశాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదే రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# హైదరాబాద్ సెగ.. బెంగళూరుకు

- సీజేఐ ఆహ్వానంపై విద్యార్థుల అభ్యంతరం
- లా కాలేజీల్లో పెరుగుతున్న అసమ్మతి
- ఎన్‌ఎల్ఎస్ఐయూ విద్యార్థుల సంఘీభావం



హైదరాబాద్‌లోని నల్సార్ వివాదం తాజాగా బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీకి చేరింది. సీజేఐ సూర్యకాంత్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మణన్ కుమార్ మిశ్రాను తమ కాన్వొకేషన్‌కు ఆహ్వానించడాన్ని ఎన్‌ఎల్ఎస్ఐయూ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు వ్యతిరేకించారు. నల్సార్ విద్యార్థులకు తాము సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు శనివారం విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కును కాపాడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అధికారులను ప్రశ్నించినందుకు విద్యార్థుల వృత్తి భవిష్యత్తుపై ప్రభావం పడకూడదని వారు పేర్కొన్నారు.

### బీసీఐ తీరుపై తీవ్ర ప్రశ్నలు

నల్సార్ విద్యార్థులు సీజేఐని కాన్వొకేషన్‌కు ఆహ్వానించడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో బీసీఐ తొలుత కఠిన నిర్ణయం తీసుకుంది. 2026 నల్సార్ బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయకూడదని రాష్ట్ర బార్ కౌన్సిళ్లను ఆదేశించింది. ఈ చర్యపై దేశవ్యాప్తంగా విమర్శలు రావడంతో ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నారు. బీసీఐ చైర్మన్ మణన్ కుమార్ మిశ్రా విద్యార్థుల గౌరవం, స్వతంత్ర ఆలోచన, వారి ఆందోళనలను గౌరవించాల్సిందేనని క్షమాపణలు చెప్పారు. అయితే ఎన్‌ఎల్ఎస్ఐయూ విద్యార్థులు మాత్రం నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులకు బీసీఐ నుంచి బేషరతు క్షమాపణలు రావాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద ఉత్తర్వులకు బీసీఐ అధికారిక లెటర్‌హెడ్ ఎలా ఉపయోగించబడిందో వివరించాలని కోరారు.

### నల్సార్ ఘటనతో మొదలైన వివాదం

నల్సార్‌లో కొందరు విద్యార్థులు సీజేఐ సూర్యకాంత్‌ను కాన్వొకేషన్ ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. ఢిల్లీలో నిరసనలకు సంబంధించిన ఓ పిటిషన్ అత్యవసర విచారణ అంశంలో సీజేఐ చేసిన వ్యాఖ్యలపై విద్యార్థులు అభ్యంతరం తెలిపారు. అనంతరం బీసీఐ చర్య తీవ్ర చర్చకు దారితీసింది. విద్యార్థుల స్వేచ్ఛ, న్యాయ వ్యవస్థ గౌరవం, వృత్తిపరమైన స్వాతంత్ర్యం మధ్య సమతుల్యతపై ఇప్పుడు చర్చ మొదలైంది. ఎన్‌ఎల్ఎస్ఐయూ కూడా ఈ అంశంలో గళమెత్తడంతో దేశంలోని ప్రముఖ న్యాయ విద్యాసంస్థలు, సుప్రీంకోర్టు, న్యాయవాదుల నియంత్రణ సంస్థల మధ్య సంబంధాలపై కొత్త ప్రశ్నలు తెరపైకి వచ్చాయి.

# బీసీఐ చైర్మన్ క్షమాపణలు

- విద్యార్థుల స్వేచ్ఛకై బీసీఐ భరోసా



న్యాయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వివాదం నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మణన్ కుమార్ మిశ్రా క్షమాపణలు తెలిపారు. ఆగస్టు 15న విడుదల చేసిన మూడు పేజీల లేఖలో తన మాటలు, లేఖలు, ఆదేశాలతో ఏ విద్యార్థి మనోభావాలు దెబ్బతిన్నా తాను చింతిస్తున్నానని, హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నానని చెప్పారు. విద్యార్థుల అభిప్రాయాలను గౌరవించాలని, వారు స్వతంత్రంగా ఆలోచించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకునే హక్కు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. నిరసనలు ప్రజాస్వామ్యంలో సహజమైనవని పేర్కొంటూ, విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి ఉండకూడదన్నారు. వివాదంపై కొత్త వివరాలు వెలుగులోకి వస్తే ప్రతి అంశాన్ని ఓపెన్ మైండ్‌తో, నిష్పక్షపాతంగా మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

### చర్చలతోనే సమస్యకు పరిష్కారం

కాన్వొకేషన్ వంటి ముఖ్యమైన కార్యక్రమాలకు హాజరు కావాలా వద్దా అన్న నిర్ణయం పూర్తిగా విద్యార్థులదేనని మిశ్రా తెలిపారు. ఎవరినీ బలవంతంగా హాజరుకావాలని, దూరంగా ఉండాలని ఒత్తిడి చేయకూడదన్నారు. న్యాయవ్యవస్థ, బార్, విశ్వవిద్యాలయాలు, న్యాయ విద్యార్థుల మధ్య విభేదాలు శాశ్వత దూరాలకు దారితీయకూడదని సూచించారు. సంభాషణ, స్పష్టత, పరస్పర గౌరవంతోనే సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. బయటి ప్రభావాలతో ఈ అంశానికి రాజకీయ రంగు రాకూడదని అన్నారు. విద్యార్థులు పరిణతితో వాస్తవాలను పరిశీలించి స్వతంత్ర నిర్ణయం తీసుకునే సామర్థ్యం కలిగి ఉన్నారని మిశ్రా పేర్కొన్నారు. తాజా పరిణామాలతో న్యాయ విద్యార్థుల స్వేచ్ఛ, అభిప్రాయ వ్యక్తీకరణ హక్కులపై జరుగుతున్న చర్చ ప్రాధాన్యం సంతరించుకుంది.



# 'వజ్ర ప్రహార్'తో నేరాలకు చెక్

## కార్డన్ సెర్చ్‌లో 58 వాహనాలు సీజ్

బాపట్ల జిల్లాను గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో పోలీసులు 'వజ్ర ప్రహార్' కార్యక్రమంలో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాలతో చీరాల వన్‌టౌన్, అమృతలూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 125 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 58 వాహనాలను సీజ్ చేశారు. అమృతలూరు పరిధిలోని పంచలవరంలో 29 వాహనాలను స్వాధీనం చేసుకోగా, చీరాల బండపాలెంలో 21 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను సీజ్ చేశారు. ప్రతి ఇంటినీ తనిఖీ చేసిన పోలీసులు పాత నేరస్థుల వివరాలను సేకరించారు. గంజాయి, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాపై సమాచారం ఉంటే 112కు లేదా బాపట్ల జిల్లా కమాండ్ కంట్రోల్ నంబర్ 8333813228కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

# రైతులకు తక్షణ సాగునీరు.. జ్యోతుల హామీ

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంక, చిల్లంగి, జగపతినగరం గ్రామాల రైతులకు తక్షణ సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చర్యలు చేపట్టారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి పోలవరం కాలువ రెగ్యులేటర్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడి నుంచి గోదావరి జలాలను ఏలేరు కాలువలోకి విడుదల చేసి ఆయా గ్రామాలకు నీరు అందించే అవకాశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే వేలాది ఎకరాల పంటలకు సాగునీరు అందే అవకాశం ఉందని తెలిపారు. సుమారు 40 ఏళ్లుగా ఈ కాలువ ద్వారా నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇది శుభవార్తగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల నుంచి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని జ్యోతుల నెహ్రూ తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అధికారులతో సమన్వయం చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# దేవనూతల బాధితులను ఆదుకుంటామన్న ఎమ్మెల్యే

చీరాల మండలం దేవనూతల గ్రామంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. రైతులు గోనబోయిన పెద్ద అంకయ్య, చిన్న అంకయ్యలకు చెందిన 10 ఎకరాల గడ్డివాముకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. నిప్పురవ్వలు ఎగసిపడటంతో సమీపంలోని గోనబోయిన చిన్న అంకయ్య, గోనబోయిన పెద్ద అంకయ్య, గడ్డం చలపతిరావులకు చెందిన మూడు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో బాధిత కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయి. సమాచారం అందుకున్న చీరాల ఎమ్మెల్యే మద్దలూరి మాలకొండయ్య వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. తక్షణ ఆర్థిక సాయం అందించి, ప్రభుత్వం తరఫున సహాయక చర్యలు వేగవంతం చేయాలని చీరాల తహశీల్దార్ గోపికృష్ణను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. తహశీల్దార్ సూచనల మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సహకారంతో బాధితులకు నిత్యావసర గృహోపకరణాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ విషయాన్ని బ్రాంచ్ ఛైర్మన్ బూదరాజు శశికిరణ్ తెలిపారు.




# డీఎస్సీపై రగిలిన టీచర్ల భేరి

» ఆరోపణలపై ఉపాధ్యాయుల ఆగ్రహం

» విజయవాడలో టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ

మెగా డీఎస్సీ 2025 నియామకాలపై జరుగుతున్న ఆరోపణలకు వ్యతిరేకంగా వేలాది మంది నూతన ఉపాధ్యాయులు విజయవాడలో ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించారు. సంవత్సరాలుగా ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తూ, ఉపాధ్యాయ వృత్తిపై గౌరవంతో శిక్షణ పొందిన అభ్యర్థులు రాత్రింబవళ్లు కష్టపడి డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యామని తెలిపారు. రోజుకు 16 గంటల వరకు చదివి పరీక్షలో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించామని పలువురు ఉపాధ్యాయులు చెప్పారు. తమ నియామకాలపై తప్పుడు ఆరోపణలు చేయడం వల్ల తీవ్రంగా బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ 2025 నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని చెబుతూ, తమ ప్రతిభను రాజకీయ వివాదాల్లోకి లాగొద్దని విజ్ఞప్తి చేశారు. (వివరాలు 5లో..)

# నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**మండలిలో సత్తా చాటుతామంటున్న వైసీపీ**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అమరావతి వెలగపూడిలోని అసెంబ్లీ హాల్‌లో ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశం కానుంది. శాసనమండలి సమావేశాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. భద్రతతో పాటు సభ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ఈ సమావేశాలు అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య రాజకీయ వేడికి వేదికగా మారే అవకాశం కనిపిస్తోంది. ప్రజా సమస్యలపై చర్చకు ప్రతిపక్షం సిద్ధమవుతుండగా.. ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కూటమి కూడా వ్యూహాలు సిద్ధం చేసుకుంటోంది.



## రోడ్డుపై కాదు.. సభలోనే ప్రశ్నించండి

- అసెంబ్లీకి రండి.. ప్రజా సమస్యలు మాట్లాడండి
- జగన్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు



ఏపీ అసెంబ్లీ సమావేశాలను అర్థవంతమైన చర్చలకు వేదికగా మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. వరలక్ష్మీ వ్రతం నేపథ్యంలో సెలవు అంశాన్ని దృష్టిలో పెట్టుకుని నాలుగు రోజుల సమావేశాల్లోనే బిల్లులన్నీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. సభను అనవసర ఆందోళనలు, నిరసనలకు వేదికగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. అన్ని పార్టీలకు అసెంబ్లీ సమానమైన వేదిక అని చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యేలు బయట రోడ్లపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడాన్ని ప్రస్తావిస్తూ "అసెంబ్లీకి రండి.. మీకు ఉన్న సందేహాలను సభలో అడగండి.. (వివరాలు 5లో..)



# యూజీసీ-నెట్ పరీక్షలు మళ్లీ

## మూడు సబ్జెక్టులకు రీ-ఎగ్జామ్

యూజీసీనెట్ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లోపాలపై వచ్చిన ఫిర్యాదులతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇంగ్లిష్, సోషియాలజీ, కామర్స్ సబ్జెక్టులకు పరీక్షలను మళ్లీ నిర్వహించనుంది. ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలు సెప్టెంబర్ 9న, సోషియాలజీ పరీక్ష సెప్టెంబర్ 10న జరగనున్నాయి. జూన్‌లో నిర్వహించిన పరీక్షల తర్వాత అభ్యర్థులు ప్రశ్నపత్రాల్లో భారీగా తప్పులు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. స్పెల్లింగ్, అనువాదం, వ్యాకరణం, ప్రశ్నల రూపకల్పనలో లోపాలతో పాటు గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు గణనీయంగా పునరావృతమైనట్లు గుర్తించారు. ఇంగ్లిష్‌లో 67, కామర్స్‌లో 80కి పైగా ప్రశ్నలు గత ప్రశ్నపత్రాలతో పోలినట్లు ఆరోపణలు వచ్చాయి. ఫిర్యాదులను పరిశీలించిన కమిటీ మూడు పరీక్షలను తిరిగి నిర్వహించాలని సిఫార్సు చేసింది. దీంతో అభ్యర్థులపై అదనపు పరీక్ష ఫీజు భారం ఉండదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. పరీక్ష కేంద్రాలు, అడ్మిట్ కార్డుల వివరాలను త్వరలో ప్రకటించనుంది. మిగిలిన 84 సబ్జెక్టుల ఫలితాలు మాత్రం షెడ్యూల్ ప్రకారమే విడుదల కానున్నాయి.



బండ్ల గణేష్ కుమార్తె వివాహ వేడుకకు హాజరైన సీఎం చంద్రబాబు దంపతులు

# పెళ్లి పందిరిలో.. పగల మంటలు!

• తాడిపత్రిలో జేసీ రచ్చపై దుమారం • వేడుకలో మొదలైన రాజకీయ వేడి



తాడిపత్రి రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీడీపీ సీనియర్ నేత సంజీవరెడ్డి కుమారుడి వివాహ వేడుకలో జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పెళ్లికి హాజరైన జేసీకి సంజీవరెడ్డి సోదరుడు శ్రీరాం రెడ్డి కనిపించడంతో వివాదం మొదలైనట్లు సమాచారం. (వివరాలు 3లో..)

# గ్రూప్–1పై గోబెల్స్ ప్రచారం!

- సిట్ నివేదికను పక్కనపెడుతున్నారా?
- లోకేశ్‌ను కాపాడేందుకే కుట్ర: సురేష్




# గుంటూరు మిర్చికి శ్రీలంక షాక్!



- నాణ్యత లోపాలతో కంటైనర్ల తిరస్కరణ
- అఫ్లోటాక్సిన్.. అధిక తేమతో రిజెక్ట్

గుంటూరు మిర్చికి శ్రీలంక నుంచి భారీ షాక్ తగిలింది. అఫ్లోటాక్సిన్ స్థాయిలు, అధిక తేమ శాతం ఉన్నట్టు గుర్తించిన శ్రీలంక అధికారులు పదుల సంఖ్యలో మిర్చి కంటైనర్లను తిరస్కరించారు. తేమ ఎక్కువగా ఉండటంతో మిర్చిలో ఫంగస్ ఏర్పడినట్టు అధికారులు గుర్తించారు. దీంతో మిర్చి నాణ్యత దెబ్బతిన్నట్టు నిర్ధారించారు. నాణ్యత ప్రమాణాలను కఠినంగా అమలు చేస్తున్న శ్రీలంక.. దిగుమతుల విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదు. (వివరాలు 5లో..)




5లో..

# మరణ ప్రకటనలా డిజైన్

ఫ్లిప్‌కార్ట్ యాడ్‌పై దుమారం!

సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు



# 18 ఏళ్ల యువకుడికి రూ.98 కోట్ల నిధి!

మురుగు కాలువ తవ్వుతుంటే బంగారం

హక్కుదారులెవరో తేల్చేందుకు దర్యాప్తు

# పార్కును అమ్మొద్దు.. మాధవరం ఆగ్రహం

- మిత్రహిల్స్ పార్కు స్థలంపై నిరసన
- కాలనీకి ఆక్సిజన్ ఇచ్చే పార్కు ఇదే



హైదరాబాద్‌లో పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో పార్కులు, పచ్చదనం ప్రజలకు ఎంతో అవసరమని శేర్లింగంపల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ మిత్రహిల్స్ కాలనీలో పార్కు కోసం 2002లో కేటాయించిన ప్రభుత్వ భూమిని హెచ్‌ఎండీఏ వేలం వేసి విక్రయించేందుకు నోటిఫికేషన్ ఇవ్వడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 65లో ఎకరం 30 గుంటల భూమిని పార్కు కోసం కేటాయించగా.. అందులో కొంత భూమి ఆక్రమణలకు గురైందని, మిగిలిన స్థలాన్ని కూడా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అపార్ట్‌మెంట్ల మధ్య ఉన్న ఈ పార్కు స్థలం స్థానికులకు ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు, పిల్లలకు ఆటస్థలంగా ఉపయోగపడుతోందన్నారు. ఇప్పటికే నగరంలో కాలుష్యం పెరిగిపోయిందని, ఇలాంటి సమయంలో పచ్చదనాన్ని పెంచాల్సింది పోయి పార్కు స్థలాలను విక్రయించడం సరికాదని మండిపడ్డారు.

**మా పార్కు మాకే కావాలంటున్న స్థానికులు**

పార్కు స్థలాన్ని హెచ్‌ఎండీఏ అధికారులు వేలం వేయనున్నారన్న విషయం తెలుసుకున్న మిత్రహిల్స్ కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో వారి వెంట కలిసి మాధవరం కృష్ణారావు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ప్రభుత్వ భూములను విక్రయించడంపైనే దృష్టి పెట్టిందని ఆయన విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు కాపాడుకున్న పార్కు స్థలాన్ని విక్రయించకుండా వెంటనే వేలం ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. "మా పార్కు మాకు కావాలి.. పార్కును అమ్మొద్దు" అంటూ చిన్నారులు సైతం నినదిస్తున్నారని తెలిపారు. పార్కు స్థలం కాలనీకి ఆక్సిజన్ అందించే ప్రాంతమని, ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన స్థలాన్ని వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగించరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సిద్ధం శ్రీకాంత్, సంజీవరెడ్డి, సుబ్బరాజు, నవతారెడ్డి, సతీష్‌రావు, అనిల్‌రెడ్డి, నక్క శ్రీనివాస్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళలకు ఇరాన్ డబుల్ బహుమతి

అమెరికా సైనికుడి తలపై రూ.25 లక్షల వెల!

సైనికుడిని పట్టుకున్నా.. చంపినా డబ్బే డబ్బు

అమెరికా-ఇరాన్ యుద్ధం వేళ ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికా సైనికుడిని పట్టుకుని అప్పగించినా, హతమార్చినా 30 వేల డాలర్లు బహుమతిగా ఇస్తామని ఇరాన్ ఆర్మీ చీఫ్ అమీర్ హటామీ ప్రకటించారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.25 లక్షలకు పైగా ఉంటుంది. (వివరాలు 5లో..)

# ఛాత్రోంకీ గూంజ్‌కు పునాది

## విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ ఫోకస్



విద్యార్థులు, ఉద్యోగార్థుల సమస్యలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఫోకస్ గ్రూప్ చర్చలు రాజకీయంగా కీలకంగా మారుతున్నాయి. జూన్ నుంచి ఇప్పటివరకు ఢిల్లీ, పాట్నా, డెహ్రాడూన్ నగరాల్లో 16 సమావేశాలు నిర్వహించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, నీట్ సహా విద్యా పరీక్షల ఆశావహులతో పార్టీ నేతలు నేరుగా మాట్లాడుతున్నారు. ఈ చర్చల్లో వెల్లడైన సమస్యలు, అభ్యర్థుల అనుభవాల ఆధారంగానే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లో మూడు బహిరంగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆగస్టు 22న పుణెలో మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఫోకస్ గ్రూప్ చర్చల్లో ఉద్యోగ నియామకాల్లో జాప్యం, పేపర్ లీకులు, పరీక్షల రద్దు, ఫలితాల ఆలస్యం, కోచింగ్ కోసం భారీ ఖర్చులు వంటి అంశాలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. బిహార్‌లో 2014లో ప్రకటించిన ఉద్యోగాలకు 2018లో పరీక్ష నిర్వహించి, 2022లో ఫలితాలు ప్రకటించడంతో కొందరు అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయిన ఘటనను కాంగ్రెస్ ప్రస్తావిస్తోంది. ఉత్తరాఖండ్‌కు చెందిన మరో అభ్యర్థి నియామక ప్రక్రియ నిలిచిపోవడంతో పోటీ పరీక్షలపై నమ్మకం కోల్పోయిన విషయాన్ని కూడా పార్టీ వెల్లడించింది. ఈ చర్చలను రికార్డు చేసి, విశ్లేషించి విద్యార్థుల సమస్యలపై ఒక సమగ్ర డేటాబేస్ రూపొందిస్తున్నట్లు కాంగ్రెస్ తెలిపింది.



# రహమాన్ భారత్ పర్యటనకు బంగ్లా షరతులు

హసీనా అప్పగింత.. మరో కీలక డిమాండ్

రెండు షరతులతో ఢిల్లీ వస్తానన్న ప్రధాని

బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రహమాన్ ప్రతిపాదిత భారత్ పర్యటనకు ఢాకా రెండు కీలక షరతులు విధించింది. న్యూఢిల్లీ పర్యటనకు అనుకూల వాతావరణం ఏర్పడాలంటే భారత్ తమకు కావాల్సిన వ్యక్తులను అప్పగించాలని బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. (వివరాలు 5లో..)




# విశాఖపట్నం విమానాశ్రయం మూత ఎందుకు?

- భోగాపురానికి మారిన విమాన సేవలు..
- ఐఎన్ఎస్ డేగలో ఏం కొనసాగనుంది?
- 30 ఏళ్ల సివిల్ కార్యకలాపాలకు ముగింపు

# రోడ్డుపై కాదు.. సభలోనే ప్రశ్నించండి

- అసెంబ్లీకి రండి.. ప్రజా సమస్యలు మాట్లాడండి
- జగన్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు



ఏపీ అసెంబ్లీ సమావేశాలను అర్థవంతమైన చర్చలకు వేదికగా మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. వరలక్ష్మీ వ్రతం నేపథ్యంలో సెలవు అంశాన్ని దృష్టిలో పెట్టుకుని నాలుగు రోజుల సమావేశాల్లోనే బిల్లులన్నీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. సభను అనవసర ఆందోళనలు, నిరసనలకు వేదికగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. అన్ని పార్టీలకు అసెంబ్లీ సమానమైన వేదిక అని చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యేలు బయట రోడ్లపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడాన్ని ప్రస్తావిస్తూ "అసెంబ్లీకి రండి.. మీకు ఉన్న సందేహాలను సభలో అడగండి.. మంత్రులు సమాధానం ఇస్తారు" అని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు వచ్చి ప్రజా సమస్యలను ప్రస్తావించాలని కోరారు. ప్రభుత్వం తప్పు చేస్తే సభలో నిలదీసే హక్కు ప్రతిపక్షానికి ఉందని, సంబంధిత మంత్రులతో సమాధానం ఇప్పించే బాధ్యత స్పీకర్‌గా తాను తీసుకుంటానని అయ్యన్న చెప్పారు.

**ప్రతిపక్ష హోదా నిబంధనల ప్రకారమే**

వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్న డిమాండ్‌పైనా స్పీకర్ స్పష్టత ఇచ్చారు. ప్రతిపక్ష హోదా సంఖ్యాబలంపై ఆధారపడి ఉంటుందని, నిబంధనలకు అనుగుణంగానే నిర్ణయం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని గుర్తుచేశారు. గతంలో చంద్రబాబు 23, 24 సీట్లు గెలిచిన సమయంలో జగన్ చేసిన వ్యాఖ్యలను కూడా అయ్యన్న ప్రస్తావించారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌పై మాజీ మంత్రులు చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. క్వార్టర్స్ ఇంకా ప్రారంభించకముందే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ ఎలా ఆరోపణలు చేస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు కుటుంబాలతో నివసించేందుకు క్వార్టర్స్ నిర్మించామని, చిన్నచిన్న పనులు పూర్తయిన తర్వాత వాటిని సభ్యులకు కేటాయిస్తామని చెప్పారు. శాసనసభ, ఎమ్మెల్యే క్వార్టర్స్ వ్యవస్థను కించపరిచేలా తప్పుడు వ్యాఖ్యలు చేస్తే అవసరమైతే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోనని అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు.

# రహమాన్ భారత్ పర్యటనకు బంగ్లా షరతులు

- హసీనా అప్పగింత.. మరో కీలక డిమాండ్
- రెండు షరతులతో ఢిల్లీ వస్తానన్న ప్రధాని



బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రహమాన్ ప్రతిపాదిత భారత్ పర్యటనకు ఢాకా రెండు కీలక షరతులు విధించింది. న్యూఢిల్లీ పర్యటనకు అనుకూల వాతావరణం ఏర్పడాలంటే భారత్ తమకు కావాల్సిన వ్యక్తులను అప్పగించాలని బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. ఈ అంశంపై ఇరు దేశాల అధికారులు కొన్ని వారాలుగా సంప్రదింపులు జరుపుతున్నట్టు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ తెలిపింది. అయితే మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించడం ప్రధాన డిమాండ్‌గా నిలిచింది. హసీనాతో పాటు బంగ్లాదేశ్‌లో కేసులు ఎదుర్కొంటున్న ఇతర పరారీలను కూడా అప్పగించాలని ఢాకా కోరుతోంది.

## హసీనా వ్యాఖ్యలతో మరింత వివాదం

ఆగస్టు 5న న్యూఢిల్లీలో షేక్ హసీనా నిర్వహించిన బహిరంగ కార్యక్రమం పర్యటన చర్చలపై ప్రభావం చూపిందని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఏకేఎం షాహిదుల్ కరీమ్ తెలిపారు. హసీనాను త్వరగా అప్పగించాలని భారత్‌ను కోరుతున్నామని ఆయన చెప్పారు. అలాగే రాజకీయ కార్యకర్త షహీద్ షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్య కేసులో నిందితులైన వ్యక్తులను కూడా ద్వైపాక్షిక అప్పగింత ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్‌కు అప్పగించాలని ఢాకా కోరింది. ఈ కేసులో ఇద్దరు నిందితులను మార్చిలో పశ్చిమ బెంగాల్ పోలీసులు బోంగావ్ సరిహద్దు ప్రాంతంలో అరెస్టు చేశారు.

## భారత్ నిర్ణయంపైనే ఉత్కంఠ

తారిఖ్ రహమాన్ భారత్ పర్యటనపై తుది నిర్ణయం ఇప్పుడు న్యూఢిల్లీ స్పందనపై ఆధారపడే పరిస్థితి కనిపిస్తోంది. భారత్‌తో సార్వభౌమ సమానత్వం, జాతీయ గౌరవం, పరస్పర ప్రయోజనాల ఆధారంగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తామని బంగ్లాదేశ్ ప్రకటించింది. 2024 ఆగస్టులో విద్యార్థుల ఉద్యమం తీవ్రరూపం దాల్చడంతో హసీనా ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం ఆమె భారత్‌కు వచ్చి ఇక్కడే ఉంటున్నారు. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ హసీనాకు మానవత్వానికి వ్యతిరేక నేరాల కేసులో శిక్ష విధించింది. హసీనా అప్పగింతపై బంగ్లాదేశ్ చేసిన అభ్యర్థన పరిశీలనలోనే ఉందని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఇప్పుడు రహమాన్ పర్యటనను అదే అంశంతో ముడిపెట్టడంతో ఢిల్లీ-ఢాకా సంబంధాలపై మరోసారి ఉత్కంఠ నెలకొంది.

# మహిళలకు ఇరాన్ డబుల్ బహుమతి

- అమెరికా సైనికుడి తలపై రూ.25 లక్షల వెల!
- సైనికుడిని పట్టుకున్నా.. చంపినా డబ్బే డబ్బు



అమెరికా-ఇరాన్ యుద్ధం వేళ ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికా సైనికుడిని పట్టుకుని అప్పగించినా, హతమార్చినా 30 వేల డాలర్లు బహుమతిగా ఇస్తామని ఇరాన్ ఆర్మీ చీఫ్ అమిర్ హటామీ ప్రకటించారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.25 లక్షలకు పైగా ఉంటుంది. ఈ పథకానికి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలంటూ అభ్యర్థనలు రావడంతో నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్‌ఎన్‌ఏ వెల్లడించినట్టు ఏఎఫ్‌పీ పేర్కొంది. అయితే ఈ బహుమతి ఎప్పుడు, ఎక్కడ వర్తిస్తుందనే వివరాలను హటామీ వెల్లడించలేదు.

## మహిళలకు రూ.50 లక్షలు

ఈ ప్రకటనలో మరో సంచలన అంశం మహిళలకు ప్రత్యేక బహుమతి. అమెరికా సైనికుడిని పట్టుకునే లేదా హతమార్చే సాహసోపేత ఇరానియన్ మహిళలకు బహుమతి రెట్టింపు చేసి 60 వేల డాలర్లు ఇస్తామని హటామీ ప్రకటించారు. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.50 లక్షలకు పైగా అందే అవకాశం ఉంది. జెరూసలేం పోస్ట్ కథనం ప్రకారం ఆయుధానికి కూడా ప్రత్యేక ప్రోత్సాహకం ప్రకటించారు. అమెరికా సైనికుడిని హతమార్చేందుకు ఉపయోగించిన ఆయుధాన్ని రెట్టింపు ధరకు కొనుగోలు చేసి, సంబంధిత వ్యక్తికి కొత్త ఆయుధాన్ని ఇస్తామని హటామీ చెప్పినట్టు సమాచారం. ఉపయోగించిన ఆయుధాన్ని భవిష్యత్‌లో ఏర్పాటు చేసే మ్యూజియంలో ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

## 17 మంది అమెరికా సైనికులు మృతి

ఇరాన్ ప్రకటన వెలువడిన సమయంలో అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ పరిస్థితి అత్యంత సున్నితంగా ఉంది. జూన్ 17న కుదిరిన ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందం ప్రకారం 60 రోజుల వ్యవధి సమీపిస్తోంది. శాశ్వత పరిష్కారం కోసం చర్చలు జరగాల్సి ఉన్నా అవి ముందుకు సాగలేదు. దక్షిణ ఇరాన్, హోర్ముజ్ జలసంధి ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఘర్షణలు కొనసాగుతున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 17 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. అయితే వీరిలో ఎవరూ ఇరాన్ భూభాగంలో మృతి చెందలేదు. ఇరాక్, జోర్డాన్ వంటి ప్రాంతాల్లో వారు మరణించినట్టు నివేదికలు చెబుతున్నాయి. అమెరికా సైనిక శక్తిపై ఇరాన్ చేసిన వ్యాఖ్యలు ఈ తాజా బహుమతి ప్రకటనతో మరింత తీవ్రతను సంతరించుకున్నాయి.

# 18 ఏళ్ల యువకుడికి రూ.98 కోట్ల నిధి!

**మురుగు కాలువ తవ్వుతుంటే బంగారం**

**హక్కుదారులెవరో తేల్చేందుకు దర్యాప్తు**

బెల్జియంలో మురుగు కాలువ పనులు చేస్తున్న 18 ఏళ్ల యువకుడికి ఊహించని అదృష్టం ఎదురైంది. సాధారణంగా పైపుల మార్పిడి కోసం భూమిని తవ్వుతుండగా భారీగా బంగారు నాణేలు, బంగారు ముక్కలు, బులియన్ బార్లు బయటపడ్డాయి. ఈ నిధి విలువ సుమారు 9 మిలియన్ యూరోలు.. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.98 కోట్లు ఉంటుందని అంచనా.

## పాత భవనం గోడలో రహస్యం

సింట్‌గిల్లిస్‌డెండర్‌మొండే ప్రాంతంలో వేసవి పనికి వెళ్లిన కోబే అనే 18 ఏళ్ల విద్యార్థి ఈ నిధిని గుర్తించాడు. నేలలో ఏదో కనిపించడంతో మొదట అవి యూరో నాణేలని భావించినట్లు చెప్పాడు. కొద్దిసేపటికే వాటిలో బంగారు బార్ కనిపించడంతో అసలు విషయం అర్థమైంది. ఇంత పెద్ద మొత్తంలో నిధి దొరుకుతుందని తాము ఊహించలేదని అతడు చెప్పాడు. ఈ బంగారం ఓ సంచిలో ఉంచి, ఇటుకలతో మూసిన నేలమాళిగ గోడలో దాచినట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రదేశంలో 19వ శతాబ్దం చివర్లో నిర్మించిన ఓ విల్లా ఉంది. అది అప్పట్లో బ్రూవరీ యజమాని థియోఫిలస్ వాన్ అస్చే కోసం నిర్మించిన భవనంగా తెలుస్తోంది. అక్కడ 1899లో ప్రారంభమైన బీరు తయారీ 1970 వరకు కొనసాగింది.

**అధికారులు స్వాధీనం**



ప్రస్తుతం ఆ పురాతన భవనాన్ని కావోస్ట్ వ్లాదరీన్ అనే సామాజిక సంక్షేమ సంస్థ పునర్నిర్మిస్తోంది. కార్యాలయాలు, నివాస వసతుల కోసం భవనాన్ని పూర్తిగా మారుస్తున్నారు. ఈ పనుల్లో భాగంగానే మురుగు కాలువల కోసం తవ్వకాలు చేపట్టగా, ఇన్నేళ్లుగా గోడలో దాగి ఉన్న బంగారం వెలుగులోకి వచ్చింది. నిధి బయటపడగానే అధికారులు ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బంగారం, నాణేలను సురక్షితంగా బ్రస్సెల్స్‌లోని ఓ భద్రతా కేంద్రానికి తరలించారు. ఈ నిధి ఎప్పుడు దాచారు? ఎవరు దాచారు? అది దొంగతనానికి సంబంధించినదా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

**అదృష్టం దక్కుతుందా?**

ఈ నిధిపై హక్కు ఎవరికి ఉంటుందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. భవన నిర్మాణ సంస్థలు, సంక్షేమ సంస్థ, వాన్ అస్చే కుటుంబ వారసులు తమ హక్కును కోరే అవకాశం ఉంది. నిధికి అసలు యజమానులు ఎవరైనా ఉంటే వారు ముందుకు రావడానికి బెల్జియం చట్టం ప్రకారం కనీసం ఐదేళ్ల వ్యవధి ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. నిధిని గుర్తించిన యువకుడికి చివరికి ఏదైనా బహుమతి లభిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇంత పెద్ద మొత్తంలో బంగారం దొరికినందున దానిని తమ వద్ద ఉంచుకోలేమని పని చేస్తున్నవారికి తెలుసని కోబే చెప్పాడు. చిన్న మొత్తంలో నాణేలు దొరికితే పరిస్థితి వేరుగా ఉండేదేమో కానీ, ఇంత భారీ నిధి దొరికినందుకు ఏదో ఒక రూపంలో ఫైండర్ రివార్డ్ వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపాడు.



# నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

- మండలిలో సత్తా చాటుతామంటున్న వైసీపీ

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అమరావతి వెలగపూడిలోని అసెంబ్లీ హాల్‌లో ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశం కానుంది. శాసనమండలి సమావేశాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. భద్రతతో పాటు సభ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ఈ సమావేశాలు అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య రాజకీయ వేడికి వేదికగా మారే అవకాశం కనిపిస్తోంది. ప్రజా సమస్యలపై చర్చకు ప్రతిపక్షం సిద్ధమవుతుండగా.. ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కూటమి కూడా వ్యూహాలు సిద్ధం చేసుకుంటోంది.

## రైతులు, ఉద్యోగుల సమస్యలే అజెండా

వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కీలక సూచనలు చేశారు. ప్రజా సమస్యలను మండలిలో బలంగా ప్రస్తావించాలని ఆదేశించారు. ఉపాధ్యాయ నియామకాల్లో డీఎస్సీ 2025 పరీక్షకు సంబంధించిన ఆరోపణలు, ఔట్ సోర్సింగ్ వ్యవహారాలు, రైతుల సమస్యలను ప్రధానంగా లేవనెత్తాలని సూచించారు. పంటలకు కనీస మద్దతు ధర అందడం లేదని, సాగునీటి కొరత ఉందని, ఉచిత పంటల బీమా నిలిచిపోయిందని జగన్ ఆరోపించారు. అన్ని అంశాలపై పూర్తి సమాచారంతో సభకు హాజరై ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పార్టీ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు.

# గ్రూప్–1పై గోబెల్స్ ప్రచారం!

- సిట్ నివేదికను పక్కనపెడుతున్నారా?
- లోకేశ్‌ను కాపాడేందుకే కుట్ర: సురేష్

గ్రూప్-1 మూల్యాంకనంపై కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచారం రాజకీయ దుష్ప్రచారమేనని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. తాడేపల్లిలో వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని చెప్పేందుకు శాస్త్రీయ ఆధారాలు లేవని సిట్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఏపీపీఎస్సీకి చెందిన ఐదుగురు సభ్యులు కోర్టుకు సమర్పించిన అదనపు అఫిడవిట్‌లో కూడా హైలాండ్‌లో మాన్యువల్ మూల్యాంకనం జరగలేదని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఎవాల్యుయేటర్లు, స్క్రూటినైజర్లు, చీఫ్ ఎగ్జామినర్ల పర్యవేక్షణలోనే గ్రూప్-1 మెయిన్స్ పత్రాల మూల్యాంకనం జరిగిందని సురేష్ చెప్పారు. అవసరమైతే రెండోసారి, మూడోసారి మూల్యాంకనం చేసే విధానం కూడా ఉందని వివరించారు. ఇలాంటి ప్రక్రియను అక్రమంగా చిత్రీకరించడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందని ఆరోపించారు.

## డీఎస్సీ నుంచి దృష్టి మళ్లించే ఎత్తుగడ

గ్రూప్-1 అంశాన్ని రాజకీయంగా తెరపైకి తీసుకురావడం వెనుక విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను డీఎస్సీ వివాదం నుంచి కాపాడే ప్రయత్నం ఉందని సురేష్ ఆరోపించారు. డీఎస్సీలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది వ్యవహారం, స్పోర్ట్స్ కోటా నియామకాలు సహా పలు అంశాలపై అధికారిక లేఖలు, ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రూప్-1పై విచారణకు సిద్ధమని చెబుతున్న ప్రభుత్వం డీఎస్సీలో వెలుగుచూస్తున్న ఆరోపణలపై విచారణకు ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు. 163 మంది గ్రూప్-1 అధికారుల భవిష్యత్తును రాజకీయ ప్రయోజనాల కోసం అనిశ్చితిలోకి నెట్టొద్దని కోరారు. గ్రూప్-1పై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో డీఎస్సీ నియామకాలపై వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు.

## 163 మంది భవిష్యత్తుతో ఆటలొద్దు

గ్రూప్-1లో ఎంపికైన 163 మంది అధికారుల భవిష్యత్తును రాజకీయ వివాదంలోకి లాగడం సరికాదని ఆదిమూలపు సురేష్ అన్నారు. సిట్ నివేదిక, ఏపీపీఎస్సీ సభ్యుల అఫిడవిట్‌లోని అంశాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను పక్కనపెట్టి ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. డీఎస్సీ వ్యవహారంపై ప్రశ్నలు వస్తున్న సమయంలోనే గ్రూప్-1ను తెరపైకి తీసుకురావడం దృష్టి మళ్లించే ప్రయత్నమని విమర్శించారు. "గ్రూప్-1పై విచారణ కోరుతున్న ప్రభుత్వం.. డీఎస్సీపై విచారణకు ఎందుకు భయపడుతోంది?" అని సురేష్ ప్రశ్నించారు. ఆధారాలతో మాట్లాడేందుకు సిద్ధమని, డీఎస్సీ వ్యవహారంలోని వాస్తవాలను ఎవరూ దాచలేరని స్పష్టం చేశారు.

# మరణ ప్రకటనలా డిజైన్

**ఫ్లిప్‌కార్ట్ యాడ్‌పై దుమారం!**

**సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు**




ఫ్లిప్‌కార్ట్ ఫ్రీడమ్ సేల్ కోసం రూపొందించిన ఓ ప్రకటన ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. సాధారణ ప్రకటనలకు భిన్నంగా, మరణ ప్రకటనలను తలపించేలా యాడ్‌ను రూపొందించారు. జీవించి ఉన్న వ్యక్తుల ఫొటోలు, వ్యక్తిగత వివరాలను మెమోరియల్ బాక్సుల తరహాలో పెట్టడం సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు కారణమైంది.

**'మరణం'ను మార్కెటింగ్‌కు వాడటంపై అభ్యంతరం**

ప్రకటనలో పైభాగంలో తాము బాధపడటం లేదనే భావన వచ్చేలా సందేశం ఇచ్చారు. సేల్‌లో ఉన్న ఆఫర్లు ముగింపు దశకు చేరుకున్నాయనే విషయాన్ని చెప్పేందుకు మరణం, సంతాప ప్రకటనల తరహా విజువల్స్‌ను ఉపయోగించారు. అయితే వస్తువుల అమ్మకాలను ప్రోత్సహించేందుకు ఇలాంటి సున్నితమైన అంశాన్ని వాడటం సరికాదని పలువురు మండిపడుతున్నారు. రచయిత, కాలమిస్టు శోభా డే కూడా ఈ ప్రకటనపై తీవ్రంగా స్పందించారు. ఇది అత్యంత స్వార్థపూరిత, అసహ్యకరమైన, సున్నితత్వం లేని ప్రకటనగా అభివర్ణిస్తూ ఫ్లిప్‌కార్ట్‌పై విమర్శలు చేశారు. సేల్ విఫలమవ్వాలని, వినియోగదారులు సంస్థను బహిష్కరించాలని ఆమె పిలుపునిచ్చారు.

**'ఏఐ చిత్రాలే కదా' అంటూ కొందరి సమర్థన**

ఈ ప్రకటనపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. కొందరు దీనిని అసహ్యకరమైన, అమానవీయమైన ప్రకటనగా అభివర్ణించారు. మరికొందరు మరణించిన వారి గౌరవాన్ని కూడా ఇలాంటి ప్రకటనల కోసం ఉపయోగించకూడదని వ్యాఖ్యానించారు. సృజనాత్మక బృందం, ప్రకటనకు అనుమతి ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కొందరు డిమాండ్ చేశారు. అయితే ప్రకటనను సమర్థించినవారు కూడా లేకపోలేదు. ఇందులోని ఫొటోలు ఏఐ ద్వారా రూపొందించినవే అయితే ఎవరికి నష్టం జరిగిందని కొందరు ప్రశ్నించారు. కానీ దీనికి కౌంటర్‌గా మరో వర్గం.. చిత్రాలు ఏఐతో రూపొందించినా, మరణాన్ని సేల్ ప్రమోషన్‌కు ప్రాతిపదికగా ఉపయోగించాలనే ఆలోచనే తప్పని స్పష్టం చేసింది.

**అసలు వ్యక్తులా.. ఏఐ చిత్రాలా?**

ప్రకటనలో కనిపిస్తున్న వ్యక్తులు నిజమైనవారా లేదా అన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు. కొందరు నెటిజన్లు ఈ ప్రచారంలో ఏఐ సాయాన్ని ఉపయోగించారా అని కూడా ప్రశ్నించారు. అయితే వివాదానికి ప్రధాన కారణం చిత్రాలు నిజమైనవా కాదా అనేది కాకుండా.. మరణం, సంతాప ప్రకటనల భాషను వాణిజ్య ప్రచారానికి ఉపయోగించడమే.

ఈ వివాదంపై ఫ్లిప్‌కార్ట్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ ప్రకటన ఏయే పత్రికల ఎడిషన్లలో ప్రచురించిందన్న విషయంపైనా సంస్థ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో సోషల్ మీడియాలో విమర్శలు కొనసాగుతున్నాయి. అయితే సేల్ కంటే ఇప్పుడు వివాదాస్పద ప్రకటనపైనే ఎక్కువ చర్చ జరుగుతోంది.

# గుంటూరు మిర్చికి శ్రీలంక షాక్!

- నాణ్యత లోపాలతో కంటైనర్ల తిరస్కరణ
- అఫ్లోటాక్సిన్.. అధిక తేమతో రిజెక్ట్

గుంటూరు మిర్చికి శ్రీలంక నుంచి భారీ షాక్ తగిలింది. అఫ్లోటాక్సిన్ స్థాయిలు, అధిక తేమ శాతం ఉన్నట్టు గుర్తించిన శ్రీలంక అధికారులు పదుల సంఖ్యలో మిర్చి కంటైనర్లను తిరస్కరించారు. తేమ ఎక్కువగా ఉండటంతో మిర్చిలో ఫంగస్ ఏర్పడినట్టు అధికారులు గుర్తించారు. దీంతో మిర్చి నాణ్యత దెబ్బతిన్నట్టు నిర్ధారించారు. నాణ్యత ప్రమాణాలను కఠినంగా అమలు చేస్తున్న శ్రీలంక.. దిగుమతుల విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదు. నిబంధనలకు అనుగుణంగా లేని మిర్చి కంటైనర్లను వెనక్కి తీసుకెళ్లాలని ఎగుమతి వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ఈ పరిణామంతో గుంటూరు మిర్చి ఎగుమతిదారుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే ఎగుమతి చేసిన సరుకును వెనక్కి తీసుకెళ్లాల్సి వస్తే ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

**ఎగుమతిదారులతో శ్రీలంక చర్చలు**

శ్రీలంక అధికారులు తీసుకున్న నిర్ణయంపై గుంటూరు మిర్చి ఎక్స్‌పోర్టర్లు చర్చలు ప్రారంభించారు. తిరస్కరించిన కంటైనర్ల విషయంలో పరిష్కారం కనుగొనేందుకు శ్రీలంక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. నాణ్యత పరీక్షలు, అఫ్లోటాక్సిన్ స్థాయిలు, తేమ శాతం వంటి అంశాలపై వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గుంటూరు మిర్చికి విదేశీ మార్కెట్లలో నాణ్యత సమస్యలు ఎదురవడం ఇదే మొదటిసారి కాదు. రెండు నెలల క్రితం గుంటూరు నుంచి చైనాకు ఎగుమతి చేసిన మూడు కంటైనర్ల మిర్చిని అక్కడి అధికారులు తిరస్కరించారు. తాజాగా శ్రీలంక కూడా నిబంధనలను కఠినంగా అమలు చేస్తుండటంతో ఎగుమతిదారులు మరింత అప్రమత్తమయ్యారు. మిర్చి కోత, ఎండబెట్టడం, నిల్వ, ప్యాకింగ్ దశల్లో తేమ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. విదేశీ మార్కెట్లలో గుంటూరు మిర్చి ప్రతిష్ఠను కాపాడేందుకు నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాల్సిన పరిస్థితి నెలకొంది.



# డీఎస్సీపై రగిలిన టీచర్ల భేరి

- ఆరోపణలపై ఉపాధ్యాయుల ఆగ్రహం
- విజయవాడలో టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ



మెగా డీఎస్సీ 2025 నియామకాలపై జరుగుతున్న ఆరోపణలకు వ్యతిరేకంగా వేలాది మంది నూతన ఉపాధ్యాయులు విజయవాడలో ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించారు. సంవత్సరాలుగా ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తూ, ఉపాధ్యాయ వృత్తిపై గౌరవంతో శిక్షణ పొందిన అభ్యర్థులు రాత్రింబవళ్లు కష్టపడి డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యామని తెలిపారు. రోజుకు 16 గంటల వరకు చదివి పరీక్షలో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించామని పలువురు ఉపాధ్యాయులు చెప్పారు. తమ నియామకాలపై తప్పుడు ఆరోపణలు చేయడం వల్ల తీవ్రంగా బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ 2025 నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని చెబుతూ, తమ ప్రతిభను రాజకీయ వివాదాల్లోకి లాగొద్దని విజ్ఞప్తి చేశారు.

## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

ర్యాలీ అనంతరం ఉపాధ్యాయులు విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. హారిజాంటల్ రిజర్వేషన్‌పై కనీస అవగాహన లేకుండా నియామకాలపై ఆరోపణలు చేయడం సరికాదని మహిళా ఉపాధ్యాయులు మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తూనే చదువుకున్నామని, తినీ తినక కష్టపడి సాధించిన ఉద్యోగాలపై విష ప్రచారం చేయడం తగదన్నారు. 16 వేల మందికి పైగా టీచర్ల వెనుక 16 వేల కుటుంబాల భవిష్యత్తు ఉందని స్పష్టం చేశారు. తమ ఉద్యోగాలను అవమానించే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మా కష్టాన్ని రాజకీయాలకు వాడొద్దు

డీఎస్సీ 2025పై వైసీపీ చేస్తున్న ఆరోపణలను ఉపాధ్యాయులు తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నియామకాలు జరగలేదని, ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయలేదని వారు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేసిందని పేర్కొన్నారు. తాము ప్రతిభతో ఉద్యోగాలు సాధించామని, తమపై ఫేక్ ప్రచారం చేయడం ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. "పదే పదే ఆరోపణలు చేస్తే అవి నిజం కావు. మా కష్టం, ప్రతిభను రాజకీయాలకు బలిచేయొద్దు" అంటూ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలతో డీఎస్సీ నియామకాలపై రాజకీయ వివాదం మరింత ముదిరింది.

# గుంటూరు మిర్చికి శ్రీలంక షాక్!

- నాణ్యత లోపాలతో కంటైనర్ల తిరస్కరణ
- అఫ్లోటాక్సిన్.. అధిక తేమతో రిజెక్ట్

గుంటూరు మిర్చికి శ్రీలంక నుంచి భారీ షాక్ తగిలింది. అఫ్లోటాక్సిన్ స్థాయిలు, అధిక తేమ శాతం ఉన్నట్టు గుర్తించిన శ్రీలంక అధికారులు పదుల సంఖ్యలో మిర్చి కంటైనర్లను తిరస్కరించారు. తేమ ఎక్కువగా ఉండటంతో మిర్చిలో ఫంగస్ ఏర్పడినట్టు అధికారులు గుర్తించారు. దీంతో మిర్చి నాణ్యత దెబ్బతిన్నట్టు నిర్ధారించారు. నాణ్యత ప్రమాణాలను కఠినంగా అమలు చేస్తున్న శ్రీలంక.. దిగుమతుల విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదు. నిబంధనలకు అనుగుణంగా లేని మిర్చి కంటైనర్లను వెనక్కి తీసుకెళ్లాలని ఎగుమతి వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ఈ పరిణామంతో గుంటూరు మిర్చి ఎగుమతిదారుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే ఎగుమతి చేసిన సరుకును వెనక్కి తీసుకెళ్లాల్సి వస్తే ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

## ఎగుమతిదారులతో శ్రీలంక చర్చలు

శ్రీలంక అధికారులు తీసుకున్న నిర్ణయంపై గుంటూరు మిర్చి ఎక్స్‌పోర్టర్లు చర్చలు ప్రారంభించారు. తిరస్కరించిన కంటైనర్ల విషయంలో పరిష్కారం కనుగొనేందుకు శ్రీలంక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. నాణ్యత పరీక్షలు, అఫ్లోటాక్సిన్ స్థాయిలు, తేమ శాతం వంటి అంశాలపై వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గుంటూరు మిర్చికి విదేశీ మార్కెట్లలో నాణ్యత సమస్యలు ఎదురవడం ఇదే మొదటిసారి కాదు. రెండు నెలల క్రితం గుంటూరు నుంచి చైనాకు ఎగుమతి చేసిన

రాజ్య సంస్కరణ
సోమవారం, 17.08.2026, మేడ్చల్ మల్కాజిగిరి

# అవినీతికి చరమగీతం
# ప్రజాపాలనకు శ్రీకారం

అవినీతి... నాలుగు అక్షరాల చిన్న పదం. కానీ దాని నీడలో కోట్లాది జీవితాలు నలిగిపోతున్నాయి. అది కేవలం ఒక లంచం తీసుకునే చేయి కాదు.. ఒక పేదవాడి కన్నీటిని ధరగా మార్చే వ్యవస్థ. అది కేవలం ఒక అధికారి జేబులోకి జారే నోటు కాదు.. ఒక కుటుంబం దాచుకున్న ఆశల్ని దోచుకునే దురాశ. అది కేవలం ఒక రాజకీయ నాయకుడి అక్రమ సంపాదన కాదు.. ప్రజాస్వామ్యాన్ని లోపల నుంచి కొరుక్కుతింటున్న చీడ. అందుకే అవినీతిపై పోరాటం అంటే కేవలం అక్రమార్కులపై యుద్ధం కాదు. మన వ్యవస్థలో మనిషికి ఉన్న గౌరవాన్ని తిరిగి నిలబెట్టే మహా ప్రయత్నం. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు దాటుతున్నా.. ఒక సామాన్యుడు తన హక్కును పొందేందుకు ఎవరి కాళ్ల దగ్గరో నిలబడాల్సి వస్తే.. మనం సాధించిన స్వాతంత్ర్యం ఎంతవరకు సంపూర్ణమైంది? ఒక ఇంటి పెద్ద చనిపోతే డెత్ సర్టిఫికెట్ కోసం లంచం.. ఇంటికి కొళాయి కనెక్షన్ కోసం లంచం.. పెన్షన్ కోసం లంచం.. ఇంటి ప్లాన్ అనుమతి కోసం లంచం.. దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ కోసం లంచం.. ఆసుపత్రిలో వైద్యం కోసం కూడా లంచం. పేదవాడి అవసరం ప్రతి చోటా ఎవరో ఒకరి సంపాదనకు మార్గమైతే.. అది పరిపాలన కాదు, ప్రజలపై జరుగుతున్న నిశ్శబ్ద దోపిడీ.



- లక్ష్యం ఒక్కటే.. భావి భారత నేతలిద్దరు
- తమిళనాడు సీఎం విజయ్.. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే
- అవినీతిపై పోరాటం.. ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష




## అవినీతి అంతం.. ప్రజలదే అసలైన అధికారం

ఇలాంటి సమయంలో తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ చేసిన అవినీతి వ్యతిరేక ప్రకటనకు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే అవినీతి రహిత తమిళనాడును లక్ష్యంగా ప్రకటించడం కేవలం రాజకీయ ప్రసంగంగా కాకుండా.. పాలనకు ఒక నైతిక ప్రమాణాన్ని నిర్దేశించే ప్రయత్నంగా చూడాలి. ప్రజలే పాలకులు.. ప్రభుత్వం ప్రజలకు సేవకురాలు అనే భావనను ఆయన ముందుకు తేవడం ప్రజాస్వామ్యానికి అసలు అర్థాన్ని గుర్తుచేసే మాట. ఎన్నికల్లో ఓటు వేసిన తర్వాత ప్రజల పని పూర్తయిపోదు. ప్రజాస్వామ్యం ఓటు వేసే రోజుతో ముగిసిపోదు. అసలు ప్రజాస్వామ్యం అక్కడి నుంచే మొదలవుతుంది. ప్రభుత్వ కార్యాలయంలోకి వెళ్లినప్పుడు తనకు గౌరవం దక్కాలి. పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లినప్పుడు తన మాట వినాలి. ఆసుపత్రికి వెళ్లినప్పుడు డబ్బు ఉన్నవాడికీ, లేనివాడికీ ఒకే తలుపు తెరుచుకోవాలి. పింఛన్ కోసం వృద్ధుడు అధికారుల చుట్టూ తిరగకూడదు. విద్యార్థికి తన హక్కైన విద్య కోసం ఎవరి సిఫార్సూ అవసరం లేకూడదు. ఇవన్నీ కలిసే నిజమైన స్వాతంత్ర్యం.

### • ప్రజలే యజమానులు.. అధికారులు సేవకులే

విజయ్ చెప్పిన "ప్రభుత్వ సేవల్లో గౌరవమే తొలి నియమం" అన్న భావన ఇక్కడ అత్యంత కీలకం. ప్రభుత్వ కార్యాలయం అంటే ప్రజలకు భయం కలిగించే ప్రదేశం కాదు. అది ప్రజల సమస్యలకు పరిష్కారం లభించే చోటు కావాలి. ఒక అధికారి కుర్చీలో కూర్చున్నంత మాత్రాన అతను పాలకుడు కాలేడు. ఆ కుర్చీకి జీతం చెల్లించేది ప్రజలే. ఆ కార్యాలయాన్ని నిర్మించేది ప్రజల డబ్బే. ఆ వ్యవస్థను నడిపించేది ప్రజల పన్నులే. కాబట్టి ప్రజలను నిలబెట్టి.. అధికారులు కూర్చోవడం అనే దృశ్యం మారాలి. ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పే పరిపాలనా సంస్కృతి రావాలి. అవినీతి పెరిగేది కేవలం అవినీతిపరుల వల్ల కాదు. దానికి భయపడే సమాజం వల్ల కూడా. "ఏం చేస్తాం.. ఇవ్వకపోతే పని జరగదు" అనే నిర్లిప్తత అవినీతికి అతి పెద్ద బలం. "మన పని అయిపోతే చాలు" అనే రాజీ మనస్తత్వం దానికి రక్షణ కవచం. ఒకరికి జరిగిన అన్యాయాన్ని చూసి మరొకరు మౌనంగా ఉండటం.. చివరికి అదే అన్యాయం తన తలుపు తట్టే పరిస్థితిని తెస్తుంది. అందుకే అవినీతిపై పోరాటం ప్రభుత్వంతో మాత్రమే కాదు.. సమాజంతో కూడా జరగాలి.

### • స్కూల్ సమస్యలు.. దేశ భవిష్యత్తుకు ప్రశ్నలు ఇవే

ఇదే దిశలో మరో వైపు నుంచి వినిపిస్తున్న స్వరం కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజిత్ దీప్కే నుంచి వస్తోంది. ఆయన ప్రారంభించిన 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారం రాజకీయ నినాదం కంటే ప్రజా పర్యవేక్షణకు పిలుపుగా కనిపిస్తోంది. ఒక ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లకు నీరు లేకపోవడం.. కిటికీలు పాడైపోవడం.. విద్యార్థులకు సరిపడా బెంచీలు లేకపోవడం వంటి అంశాలను ప్రశ్నించడం చిన్న విషయం కాదు. ఎందుకంటే అక్కడ సమస్య ఒక పాఠశాలలోని గోడలది కాదు. అక్కడ ప్రశ్న దేశ భవిష్యత్తుది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా ఒక ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు కనీస నీటి సౌకర్యం లేకపోవడం మనల్ని మనమే ప్రశ్నించుకోవాల్సిన సందర్భం. కోట్ల రూపాయల పథకాలు ప్రకటించే పాలకులు.. వేల కోట్ల బడ్జెట్లు కేటాయించే ప్రభుత్వాలు.. ఆ డబ్బు చివరకు ఏ పాఠశాలకు చేరింది? ఏ బిడ్డకు ఉపయోగపడింది? ఏ గ్రామంలో మార్పు తెచ్చింది? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే. బడ్జెట్ లో కేటాయింపు ఒక సంఖ్య. కానీ ఆ సంఖ్య ఒక విద్యార్థి జీవితాన్ని మార్చినప్పుడు మాత్రమే అది అభివృద్ధి.

### • ప్రజల డబ్బు ఎక్కడికి పోతోంది.. ఫలితం ఏది?

అభిజిత్ దీప్కే తీసుకున్న మరో ముఖ్యమైన అంశం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం. ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడితే దాని మొదటి బాధితుడు పేదోడి పిల్లవాడే. ప్రైవేట్ విద్య ఖరీదైనప్పుడు.. ప్రభుత్వ విద్యా వ్యవస్థే అతని ఆశ. ఆ పాఠశాల తలుపులు బలహీనపడితే.. పేద కుటుంబం తన భవిష్యత్తు తలుపు మూసుకుపోయినట్టే. అందుకే ప్రభుత్వ పాఠశాలలను కాపాడటం అంటే కేవలం భవనాలను కాపాడటం కాదు.. సమాన అవకాశాలను కాపాడటం. ఒకవైపు అవినీతి ప్రభుత్వ నిధులను దారి మళ్లిస్తుంది. మరోవైపు బలహీనమైన పర్యవేక్షణ ఆ నిధులు ఎక్కడ ఖర్చయ్యాయో ప్రజలకు తెలియకుండా చేస్తుంది. ఈ రెండింటి మధ్యలోనే ప్రజా వ్యవస్థ బలహీనపడుతుంది. అందుకే విజయ్ అవినీతిపై పోరాటం, దీప్కే ప్రభుత్వ పాఠశాలలపై ప్రశ్నించడం.. పైకి రెండు వేర్వేరు అంశాలుగా కనిపించినా లోపల ఒకే ప్రశ్నను అడుగుతున్నాయి. ప్రజల డబ్బు ఎక్కడికి వెళ్తోంది? ప్రజలకు దాని ఫలితం ఎందుకు కనిపించడం లేదు? ఇది కేవలం తమిళనాడుకు సంబంధించిన ప్రశ్న కాదు. దేశంలోని ప్రతి రాష్ట్రానికి సంబంధించిన ప్రశ్న. ప్రతి గ్రామానికి సంబంధించిన ప్రశ్న. ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి సంబంధించిన ప్రశ్న. అవినీతి ఎక్కడ ఉన్నా.. దాని ధరను చివరికి సామాన్యుడే చెల్లిస్తాడు. ఒక కాంట్రాక్టులో అవినీతి జరిగితే రహదారి నాణ్యత తగ్గుతుంది. ఒక ఆసుపత్రి నిర్మాణంలో అవినీతి జరిగితే రోగి ప్రాణం ప్రమాదంలో పడుతుంది. ఒక పాఠశాల నిర్మాణంలో అవినీతి జరిగితే పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుంది. ఒక సంక్షేమ పథకంలో అవినీతి జరిగితే పేదవాడి హక్కు దోచుకుపోతారు.

### • మానవ హక్కులపై దాడి.. ప్రజలదే బాధ్యత

అందుకే అవినీతి ఒక ఆర్థిక నేరం మాత్రమే కాదు.. అది మానవ హక్కులపై దాడి. ఒక వృద్ధుడి పింఛన్ ఆపి లంచం అడగడం అంటే అతని జీవిత గౌరవాన్ని అవమానించడం. ఒక గర్భిణిని ఆసుపత్రిలో డబ్బు కోసం తిప్పడం అంటే ఆమె ప్రాణంతో వ్యాపారం చేయడం. ఒక విద్యార్థికి బెంచీ లేకపోవడం అంటే అతని కలలకు నేల చూపించడం. ఒక నిరుద్యోగి ఉద్యోగం కోసం డబ్బు చెల్లించాల్సి రావడం అంటే అతని ప్రతిభకు ధర నిర్ణయించడం.
ఇక్కడే ప్రజల పాత్ర మొదలవుతుంది. ప్రభుత్వాన్ని ఎన్నుకున్న తర్వాత ప్రజలు ప్రేక్షకులుగా మారకూడదు. పాలనను గమనించాలి. ప్రశ్నించాలి. సమాచారాన్ని అడగాలి. ప్రజా నిధుల వినియోగాన్ని పరిశీలించాలి. తమ గ్రామంలో పాఠశాల ఎలా ఉంది? ఆసుపత్రిలో మందులు ఉన్నాయా? రహదారి నాణ్యత ఎలా ఉంది? పింఛన్లు సమయానికి వస్తున్నాయా? ప్రభుత్వ కార్యాలయంలో పని కోసం లంచం అడుగుతున్నారా? అనే ప్రశ్నలు ప్రతి పౌరుడి రోజువారీ ప్రజాస్వామ్య బాధ్యతగా మారాలి.

### • యువత ప్రశ్నిస్తేనే ప్రజాస్వామ్యానికి కొత్త ఊపిరి

ఇదే సందర్భంలో యువత పాత్ర మరింత కీలకం. రాజకీయాలు అంటే కేవలం ఎన్నికలు, సభలు, పోస్టర్లు, నినాదాలు కాదు. రాజకీయాలు అంటే మన చుట్టూ ఉన్న సమస్యలపై ప్రశ్నించడం. అభిజిత్ దీప్కే గ్రామీణ యువత ప్రభుత్వ నిధుల వినియోగాన్ని ప్రశ్నించాలని పిలుపునివ్వడం ఈ కోణంలో ప్రాధాన్యం సంతరించుకుంటుంది. సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టడం కంటే.. ఒక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి అక్కడి వాస్తవ పరిస్థితిని నమోదు చేయడం గొప్ప ప్రజా చర్య. ఒక సమస్యను వైరల్ చేయడం కంటే.. దానికి పరిష్కారం వచ్చే వరకు ప్రశ్నించడం మరింత గొప్ప బాధ్యత. విద్య తర్వాత ప్రజారోగ్యంపై పోరాటం చేస్తామని సీజేపీ ప్రకటించడం కూడా ఇదే ఆలోచనకు కొనసాగింపు. పాఠశాలల్లో పిల్లలకు సదుపాయాలు లేకపోవడం ఎంత తీవ్రమైన సమస్యో.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పడకలు లేకపోవడం, పరీక్షల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సి రావడం కూడా అంతే తీవ్రమైన సమస్య. విద్య, వైద్యం, ఉపాధి, భద్రత.. ఇవన్నీ ప్రజల హక్కులు. వాటిని అందించడం ప్రభుత్వ కర్తవ్యం. వాటి కోసం ప్రజలను అడుక్కునే పరిస్థితి రావడం ప్రజాస్వామ్య వైఫల్యం.

### • అవినీతి అంతానికి నాయకత్వం ప్రజలదే

అయితే అవినీతిని అంతం చేయడం ఒక్కరోజులో సాధ్యమయ్యే పని కాదు. ఒక ప్రసంగంతో కాదు. ఒక చట్టంతో కాదు. ఒక నాయకుడి సంకల్పంతో మాత్రమే కాదు. రాజకీయ నాయకత్వం నిజాయితీగా ఉండాలి. అధికార వ్యవస్థ జవాబుదారీతనంతో పనిచేయాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మీడియా ప్రశ్నించాలి. యువత పర్యవేక్షించాలి. న్యాయ వ్యవస్థ కఠినంగా స్పందించాలి. ముఖ్యంగా అవినీతిని సామాజికంగా అంగీకరించని వాతావరణం ఏర్పడాలి. అవినీతిపరుడు పెద్దమనిషి కాదు. కోట్లు సంపాదించినవాడు విజయవంతుడు కాదు. ప్రజల సొమ్మును దోచుకుని కట్టుకున్న భవనం అభివృద్ధికి చిహ్నం కాదు. ప్రజల డబ్బుతో ప్రజలకు సేవ చేయగలిగిన వ్యవస్థే నిజమైన సంపద. ప్రజల కళ్లలోకి చూసి సమాధానం చెప్పగలిగిన నాయకత్వమే నిజమైన నాయకత్వం. తన కుర్చీని అధికారం కోసం కాకుండా బాధ్యతగా చూసే అధికారి మాత్రమే నిజమైన ప్రజా సేవకుడు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చెప్పిన అవినీతి రహిత రాష్ట్రం లక్ష్యం.. అభిజిత్ దీప్కే ముందుకు తెచ్చిన 'స్కూల్ ఠీక్ కరో' వంటి ఉద్యమాలు.. ఒక పెద్ద మార్పు వైపు చూపుతున్న దిక్సూచులుగా చూడవచ్చు. ఒకటి పాలనా వ్యవస్థను శుభ్రం చేయాలని చెబుతోంది. మరొకటి ప్రభుత్వ వ్యవస్థలోని లోపాలను ప్రజల ముందుకు తెచ్చి సరిచేయాలని కోరుతోంది. రెండింటి గమ్యం ఒక్కటే—ప్రజల డబ్బు ప్రజలకే.. ప్రజల హక్కు ప్రజలకే.. ప్రజల గౌరవం ప్రజలకే. స్వాతంత్ర్యం అంటే జెండా ఎగరేయడం మాత్రమే కాదు. భయంలేకుండా ప్రభుత్వ కార్యాలయంలోకి వెళ్లగలగడం. లంచం ఇవ్వకుండా తన పని చేయించుకోగలగడం. డబ్బులేకున్నా నాణ్యమైన విద్య పొందగలగడం. పేదరికం ఉన్నా గౌరవంగా వైద్యం పొందగలగడం. తన సమస్యను చెప్పేందుకు ఎవరి కాళ్లూ పట్టుకోనవసరం లేకపోవడం. ఇవన్నీ కలిసినప్పుడే స్వాతంత్ర్యానికి అర్థం.

### అవినీతి అంతం.. ప్రజా పాలనకు శ్రీకారం

అందుకే ఇప్పుడు దేశం ముందు నిలిచిన అసలు నినాదం-అవినీతి అంతం. అది ఒక ప్రభుత్వ నినాదంగా మిగలకూడదు. ప్రతి పౌరుడి సంకల్పంగా మారాలి. ప్రతి కార్యాలయంలో ఒక ప్రశ్న వినిపించాలి-"ప్రజలకు సేవ చేస్తున్నారా? లేక ప్రజల నుంచే సేవలు వసూలు చేస్తున్నారా?" ప్రతి పాఠశాలలో మరో ప్రశ్న వినిపించాలి. "పిల్లల భవిష్యత్తుకు సరిపడా సదుపాయాలు ఉన్నాయా?" ప్రతి ఆసుపత్రిలో "డబ్బు లేనివాడి ప్రాణానికి కూడా ఇదే విలువ ఉందా?" ప్రజలే పాలకులు అన్న మాట కేవలం ప్రసంగంలో వినిపించే నినాదం కాకూడదు. అది పాలనా సంస్కృతిగా మారాలి. అధికారులు సేవకులనే భావన కేవలం పుస్తకాల్లో ఉండకూడదు. అది ప్రభుత్వ కార్యాలయాల తలుపుల దగ్గర కనిపించాలి. రాజకీయ నాయకుడి చేతిలో అధికారం ఉండొచ్చు.. అధికారి చేతిలో ఫైలు ఉండొచ్చు.. కానీ ఆ రెండింటికీ యజమాని ప్రజలే. అవినీతి అనే చీకటి ఎంత కాలంగా ఉందన్నది ముఖ్యం కాదు. దాన్ని తొలగించడానికి మొదటి దీపం ఎక్కడ వెలిగిందన్నదే ముఖ్యం. ఆ దీపం తమిళనాడులో వెలిగినా.. ఆ వెలుగు దేశమంతా వ్యాపించాలి. ఒక నాయకుడి మాట మరో యువకుడి ప్రశ్నగా మారాలి. ఒక యువకుడి ప్రశ్న మరో గ్రామం చైతన్యంగా మారాలి. ఆ చైతన్యం ఒక ఉద్యమంగా మారాలి. చివరకు ప్రజల డబ్బు దోచుకోవడానికి భయపడే వ్యవస్థ.. ప్రజల ప్రశ్నకు సమాధానం చెప్పే ప్రభుత్వం.. ప్రజల ముందు తలవంచే పాలన ఏర్పడాలి. అప్పుడు మాత్రమే స్వాతంత్ర్యానికి కొత్త అర్థం పుడుతుంది. జెండా ఆకాశంలో ఎగురుతూనే ఉండాలి.. ప్రజల గౌరవం నేలమీద నిలబడాలి. అధికారం కుర్చీలో ఉండొచ్చు.. అధికారం మీద హక్కు మాత్రం ప్రజలదే. అవినీతి ఎంత బలంగా ఉన్నా.. ప్రజా చైతన్యం దానికంటే బలంగా మారాలి. అదే కొత్త స్వాతంత్ర్య సంకల్పం. అదే ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం. అవినీతి అంతం.. ప్రజా పాలన ఆరంభం.



### • ప్రజలే యజమానులు.. పాలన ప్రజల కోసమే

అవినీతిపై పోరాటం ఒకరోజులో ముగిసే యుద్ధం కాదు. ఒక నాయకుడి ప్రసంగంతోనో, ఒక చట్టంతోనో వ్యవస్థ పూర్తిగా మారదు. రాజకీయ నాయకత్వం నిజాయితీగా ఉండాలి. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి. ప్రజలు ప్రశ్నించే ధైర్యం చూపాలి. మీడియా నిజాలను వెలుగులోకి తేవాలి. యువత ప్రభుత్వ పథకాలు, పాఠశాలలు, ఆసుపత్రుల పనితీరును గమనించాలి. అప్పుడే ప్రజా నిధులకు అసలైన విలువ వస్తుంది. విజయ్ అవినీతి రహిత తమిళనాడు లక్ష్యాన్ని ప్రకటించడం, అభిజిత్ దీప్కే ప్రభుత్వ పాఠశాలల సమస్యలను ప్రశ్నించడం.. రెండు వేర్వేరు మార్గాల్లా కనిపించినా వాటి గమ్యం ప్రజల హక్కుల పరిరక్షణే. స్వాతంత్ర్యం అంటే కేవలం జెండా ఎగరేయడం కాదు. లంచం లేకుండా పని జరగడం.. పేదోడికి గౌరవంగా వైద్యం అందడం.. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య దక్కడం.. ప్రజల ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పడం. ఈ మార్పు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం నిజమైన అర్థాన్ని పొందుతుంది. అవినీతి అంతం కావాలి.. ప్రజా పాలన బలపడాలి. అదే కొత్త స్వాతంత్ర్య సంకల్పం.




### ఇంకా చాలా ఉంది!

**అవినీతిపై విజయ్ సంకల్పం**

తమిళనాడు సీఎం విజయ్ తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో అవినీతి రహిత తమిళనాడును లక్ష్యంగా ప్రకటించారు. ప్రజలే యజమానులు.. ప్రభుత్వం సేవకురాలు అనే భావనను ముందుకు తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు గౌరవం దక్కాలని, లంచాలు లేకుండా ప్రభుత్వ సేవలు అందాలని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం ఓటుతో ముగియదని, అక్కడి నుంచే అసలైన ప్రజా పాలన ప్రారంభమవుతుందని సందేశమిచ్చారు.

**అధికారులు సేవకులే.. ప్రజలే యజమానులు**

ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు భయం కలిగించే ప్రదేశాలుగా కాకుండా సమస్యలకు పరిష్కారం చూపే కేంద్రాలుగా మారాలి. అధికారుల కుర్చీలు ప్రజల పన్నులతో నడుస్తున్నాయని గుర్తుచేస్తూ, ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పే పాలనా సంస్కృతి రావాలని సూచిస్తోంది. "ఇవ్వకపోతే పని జరగదు" అనే సామాజిక నిర్లిప్తతే అవినీతికి బలమని, దాన్ని ఎదుర్కోవడం అందరి బాధ్యతని గుర్తెరగాలి.

**పాఠశాలలపై ప్రజా పర్యవేక్షణ**

కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజిత్ దీప్కే ప్రారంభించిన 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారం ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. మరుగుదొడ్లకు నీరు లేకపోవడం, కిటికీలు పాడవడం, బెంచీలు లేకపోవడం వంటి సమస్యలను ప్రజల దృష్టికి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయో ప్రశ్నిస్తోంది. పాఠశాలల బలోపేతమే పేద పిల్లల భవిష్యత్తుకు కీలకమని చెబుతోంది.

**అవినీతి.. కేవలం ఆర్థిక నేరం కాదు**

అవినీతి వల్ల చివరకు సామాన్యుడే నష్టపోతాడు. పింఛన్ కోసం లంచం అడగడం వృద్ధుడి గౌరవాన్ని దెబ్బతీస్తుంది. ఆసుపత్రిలో డబ్బు కోసం రోగిని తిప్పడం ప్రాణాలతో చెలగాటమవుతుంది. పాఠశాలలకు నిధులు చేరకపోతే పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుంది. అందుకే అవినీతిని కేవలం ఆర్థిక నేరంగా కాకుండా మానవ హక్కులపై దాడిగా చూడాలని కథనం స్పష్టం చేస్తోంది.

**యువత చైతన్యమే ప్రజా బలం**

అవినీతి నిర్మూలనకు నాయకుల సంకల్పం మాత్రమే సరిపోదు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి, మీడియా ప్రశ్నించాలి, యువత పర్యవేక్షించాలి, ప్రజలు తమ హక్కుల కోసం నిలబడాలి. విజయ్ అవినీతి వ్యతిరేక లక్ష్యం, అభిజిత్ దీప్కే ప్రభుత్వ పాఠశాలలపై పోరాటం వేర్వేరు అంశాలుగా కనిపించినా గమ్యం ఒక్కటే—ప్రజల డబ్బు ప్రజలకే, ప్రజల హక్కు ప్రజలకే, ప్రజల గౌరవం ప్రజలకే.

# జెన్ జీ..లవ్ గేమ్!
# మామూలుగా ఉండదు

**ప్రేమ మారిందా... ప్రేమించే విధానం మారిందా?**




**"ప్రేమ కోసమై వలలో పడెను పాపం పసివాడు..." అనే పాట ఒకప్పుడు ప్రేమకు ప్రతిరూపంగా నిలిచింది. అమాయకత్వం, ఎదురు చూపులు, త్యాగం, ఆరాధన... ఇవే ప్రేమకు నిర్వచనాలుగా ఉండేవి. ప్రేమ కోసం ప్రాణాలు ఇచ్చే కథలు సినిమాల్లో మాత్రమే కాదు. నిజ జీవితంలోనూ కనిపించేవి. ప్రేమించిన వ్యక్తి ఒక్కసారి నవ్వితే చాలు... ఆ నవ్వులోనే జీవితాన్ని చూసేవారు.. ఒక్క లేఖ కోసం రోజులు ఎదురు చూసేవారు. ఒక చూపు కోసం గంటల తరబడి బస్టాండ్‌లలో నిలబడేవారు. ప్రేమను నిరూపించడానికి మాటలు అవసరం ఉండేవి కాదు. మనసు చాలు. కాలం మారింది. "ఎదుటా నీవే... ఎదలోనా నీవే..." అంటూ ప్రేమ కవిత్వంగా మారింది. మొబైల్ ఫోన్లు వచ్చాయి. ఎస్‌ఎంఎస్‌లు వచ్చాయి. రాత్రంతా మాట్లాడుకునే రోజులు మొదలయ్యాయి. ప్రేమ అంటే కేవలం బాధ కాదు... ఆనందం కూడా అనే భావన యువతలో పెరిగింది. ప్రేమ వ్యక్తీకరణ మారింది. దూరాలు తగ్గాయి. భావాలు మరింత దగ్గరయ్యాయి. ఇప్పుడు మరో తరం వచ్చింది. "నీ కన్ను నీలి సముద్రం... నా మనసేమో అందులో పడవ ప్రయాణం..." అంటూ ప్రేమ మరో రూపాన్ని సంతరించుకుంది. రీల్స్ వచ్చాయి. స్టేటస్‌లు వచ్చాయి. ఎమోజీలు వచ్చాయి. ఒక హార్ట్ గుర్తు వెనుక వెయ్యి భావాలు దాగిపోయాయి. ఒక "సీన్" వెనుక లక్ష అనుమానాలు పుట్టుకొచ్చాయి. ఒక "టైపింగ్..." కనిపిస్తే గుండె వేగం పెరిగే కాలం వచ్చింది. ఇదే జెన్ జీ ప్రేమ. ఇది ప్రేమా? లేక ఆటా? లేక ఒక మానసిక ప్రయోగమా? అనే ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నమే ఈ కథనం.**

## • ప్రేమను కొలుస్తున్న సోషల్ మీడియా పోస్టులు

"నన్ను నిజంగా ప్రేమిస్తే ఇప్పుడే వచ్చి కలువు...", "నా కోసం ఇది చేయి...", "నువ్వు ఎంత ప్రేమిస్తున్నావో నిరూపించు..." వంటి మాటలు సినిమాల్లో బాగుంటాయి. కానీ నిజ జీవితంలో ఇవి ప్రేమ కంటే ఒత్తిడిని పెంచుతాయి. నమ్మకం ఉన్న చోట నిరూపణ అవసరం ఉండదు. గతం గురించి మాట్లాడటం తప్పు కాదు. కానీ ప్రతి సంభాషణలో మాజీ ప్రేమికుడే ప్రధాన అంశమైతే, కొత్త సంబంధం కూడా పాత గాయాల నీడలో నడవాల్సి వస్తుంది. అలాగే ప్రేమలో "నేను" అనే పదం ఎక్కువైతే... "మనం" అనే పదం చిన్నదైపోతుంది. ఎప్పుడూ తన గురించే మాట్లాడటం, ఎదుటివారి భావాలను పట్టించుకోకపోవడం, బంధాన్ని నెమ్మదిగా బలహీనపరుస్తాయి. సోషల్ మీడియా పోస్టులతో ప్రేమను కొలవడం కూడా కొత్త సమస్యగా మారింది. స్టోరీలో ఫోటో పెట్టకపోతే ప్రేమ లేదని భావించడం, బర్త్‌డే పోస్ట్ రాయకపోతే బాధపడటం, రిలేషన్‌షిప్ స్టేటస్ మార్చకపోతే అనుమానం పడటం... ఇవన్నీ బంధాన్ని వాస్తవం నుంచి వర్చువల్ ప్రపంచానికి తీసుకెళ్తున్నాయి. నిజమైన ప్రేమ ఫోన్ స్క్రీన్ మీద కాదు... మనసులో కనిపించాలి.

## • లైక్స్ మధ్య చిక్కుకున్న జెన్ జీ ప్రేమ

ప్రతి తరం ప్రేమించింది. కానీ ప్రతి తరం ప్రేమించే విధానం వేరు. తాతల కాలంలో ప్రేమను బయటపెట్టడానికి ధైర్యం ఉండేది కాదు. తల్లిదండ్రుల కాలంలో ప్రేమను కాపాడుకోవడానికి పోరాటం ఉండేది. ఇప్పుడు మాత్రం ప్రేమను మొదలుపెట్టడం కంటే కొనసాగించడమే పెద్ద సవాల్‌గా మారింది. ఎందుకంటే ఇప్పుడు ప్రేమలో ఇద్దరు మాత్రమే ఉండటం లేదు. వారితో పాటు సోషల్ మీడియా కూడా వస్తోంది. ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, వాట్సాప్ బ్లూ టిక్స్, ఫాలోవర్స్, లైక్స్, రీల్స్... ఇవన్నీ కూడా ప్రేమలో భాగమైపోయాయి. ఇప్పుడు ప్రేమ ఇద్దరి మధ్య కాకుండా, ఒకరి ఫోన్‌లో ఉన్న నోటిఫికేషన్ల మధ్య జరుగుతోంది. ఒకప్పుడు ప్రేమలో ఒక్క ప్రశ్న మాత్రమే ఉండేది... "నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?" ఇప్పుడు ఆ ప్రశ్న స్థానంలో కొత్త ప్రశ్నలు వచ్చాయి. "నా మెసేజ్ చూసి రిప్లై ఎందుకు ఇవ్వలేదు?", "నా స్టోరీ చూసి లైక్ ఎందుకు పెట్టలేదు?", "ఆ అమ్మాయి ఫొటోకి హార్ట్ ఎందుకు పెట్టావు?", "నేను ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు నువ్వెక్కడ? ప్రేమలో భావాలు తగ్గలేదు. కానీ వాటి స్థానంలో అనుమానాలు పెరిగాయి. సంబంధాలను నడిపేది ఇప్పుడు హృదయం మాత్రమే కాదు... అల్గోరిథమ్ కూడా. ఎవరికి ముందు రిప్లై ఇచ్చావు? ఎవరి స్టోరీ ముందు చూశావు? ఎవరిని ఫాలో అవుతున్నావు? ఇలాంటి చిన్న విషయాలే పెద్ద గొడవలకు కారణమవుతున్నాయి. జెన్ జీ ప్రేమలో ఒక విచిత్రమైన వైరుధ్యం కనిపిస్తుంది. అందరికీ ప్రేమ కావాలి. కానీ ఎవరూ పూర్తిగా తమ మనసు తెరవడానికి సిద్ధంగా ఉండరు. అందరికీ కమిట్‌మెంట్ కావాలి. కానీ స్వేచ్ఛను కోల్పోవద్దనుకుంటారు. అందరికీ నమ్మకం కావాలి. కానీ ముందుగా పరీక్షలు పెడతారు. ఇదే నేటి ప్రేమలోని అతిపెద్ద వైరుధ్యం.

## • ప్రేమలో పెరుగుతున్న మైండ్ గేమ్స్

సైకాలజిస్టులు చెబుతున్న ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... ఈ తరం యువత ప్రేమ కంటే రిజెక్షన్‌ను ఎక్కువగా భయపడుతోంది. అందుకే ముందుగా తమ నిజమైన భావాలను దాచేస్తున్నారు. "ముందు అతడే చెప్పాలి...", "ముందు ఆమెనే మెసేజ్ చేయాలి...", "నేను ఎక్కువగా ప్రేమిస్తున్నానని తెలియకూడదు..." అంటూ మనసు చెప్పేదాన్ని అహంకారం అడ్డుకుంటోంది. అక్కడే ప్రేమ ఒక భావోద్వేగ బంధం నుంచి మైండ్ గేమ్‌గా మారుతోంది. ఒకప్పుడు ప్రేమలో గెలవడం అంటే ఇద్దరూ కలిసి జీవితాన్ని గెలవడం. ఇప్పుడు కొందరికి ప్రేమలో గెలవడం అంటే ఎవరు ముందు మెసేజ్ చేస్తారో చూడడం, ఎవరు ఎక్కువ మిస్ అవుతారో పరీక్షించడం, ఎవరు ఎక్కువ బాధపడతారో కొలవడం. ఇది ప్రేమ కాదు... భావోద్వేగాలపై జరిగే ఒక నిశ్శబ్ద యుద్ధం. అయితే ఈ మార్పు మొత్తం చెడ్డదేనా? అసలు కాదు. ఈ తరం ప్రేమలో ఒక మంచి కోణం కూడా ఉంది. అమ్మాయిలు తమ అభిప్రాయాన్ని ధైర్యంగా చెబుతున్నారు. అబ్బాయిలు కూడా తమ భావోద్వేగాలను దాచుకోవడం తగ్గిస్తున్నారు. టాక్సిక్ సంబంధాలను వదిలి బయటకు రావాలనే అవగాహన పెరిగింది. స్వీయ గౌరవానికి విలువ పెరిగింది. కానీ అదే సమయంలో సహనం తగ్గింది. వేచి చూసే గుణం తగ్గింది. క్షమించే మనసు తగ్గింది. ఇదే నేటి ప్రేమలోని అతిపెద్ద సంక్షోభం. ప్రేమ ఇప్పటికీ అదే. మారింది మనుషులు కాదు. మారింది ప్రేమను వ్యక్తం చేసే భాష. ఒకప్పుడు లేఖలు మాట్లాడేవి. తర్వాత ఫోన్ మాట్లాడింది. ఇప్పుడు నోటిఫికేషన్లు మాట్లాడుతున్నాయి. కానీ ఒక విషయం మాత్రం ఎప్పటికీ మారలేదు. ప్రేమకు ఇప్పటికీ కావాల్సింది నిజాయితీనే. అది లేకపోతే అందమైన ఫొటోలు, వేలాది ఫాలోవర్లు, లక్షల వ్యూస్ ఉన్నా... సంబంధం నిలబడదు.

## • ప్రేమకు రెడ్ ఫ్లాగ్స్ ప్రమాద ఘంటికలు

మైండ్ గేమ్స్... రెడ్ ఫ్లాగ్స్... ప్రేమను చంపేస్తున్న కొత్త అలవాట్లు! ప్రేమ ఒకప్పుడు హృదయాల మధ్య ప్రయాణించేది. ఇప్పుడు అది ఫోన్ల మధ్య ప్రయాణిస్తోంది. ఒకప్పుడు ప్రేమలో ఎదురు చూపు ఉండేది. ఇప్పుడు "లాస్ట్ సీన్" ఉంది. ఒకప్పుడు ప్రేమికులు కళ్లలోకి చూసి నిజం వెతికేవారు. ఇప్పుడు స్క్రీన్‌షాట్‌లలో ఆధారాలు వెతుకుతున్నారు. ప్రేమకు టెక్నాలజీ కొత్త రెక్కలు ఇచ్చింది. కానీ అదే టెక్నాలజీ అనుమానాలకు కూడా కొత్త దారులు తెరిచింది. ఈ నేపథ్యంలోనే "లవ్ మైండ్ గేమ్స్" అనే కొత్త సంస్కృతి పుట్టుకొచ్చింది. ప్రేమించడమే కాదు... ప్రేమిస్తున్నానని వెంటనే తెలియనివ్వకపోవడం, ఎదుటివారిని పరీక్షించడం, కావాలనే అయోమయంలో ఉంచడం కొందరికి ఇప్పుడు తెలివితేటలుగా కనిపిస్తోంది. ఒక మెసేజ్ వచ్చింది. చూసింది. కానీ వెంటనే రిప్లై ఇవ్వదు. గంట తర్వాత... కొన్నిసార్లు మరుసటి రోజు. కారణం బిజీ కాదు. "నేను అంత ఈజీ కాదు" అనే భావన కలిగించడం. సోషల్ మీడియాలో "వెంటనే రిప్లై ఇవ్వొద్దు", "ఎక్కువ ఆసక్తి చూపొద్దు", "కొంచెం మిస్టరీగా ఉండు" వంటి సలహాలు కనిపిస్తాయి. కానీ వాస్తవ జీవితం సోషల్ మీడియా వీడియో కాదు. ఎదుటివారికి మీ మనసు తెలియదు. మీ నిశ్శబ్దాన్ని వారు ఆసక్తి లేకపోవడంగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. ప్రేమను పెంచాలని వేసిన వ్యూహమే, సంబంధాన్ని మొదలయ్యే ముందే ముగించవచ్చు. ప్రేమ అనేది ఇద్దరూ కలిసి నడిచే ప్రయాణం. ఒకరు లాగితే, మరొకరు నిలబడితే ఆ ప్రయాణం ఎక్కువ దూరం వెళ్లదు. ప్రతి కాల్ అతడే చేయాలి... ప్రతి మెసేజ్ అతడే పంపాలి... ప్రతి కలయిక అతడే ప్లాన్ చేయాలి... ప్రతి సారీ క్షమాపణ కూడా అతడే చెప్పాలి... ఇలా ఒకరి భుజాల మీదే మొత్తం బంధం నిలబడితే, కొంతకాలానికి అలసట మొదలవుతుంది. "ఈరోజు ఎలా ఉన్నావు?" అనే చిన్న ప్రశ్న కూడా ఎంతో విలువైనదే. పరస్పర ప్రయత్నమే బంధానికి బలం.

## • ప్రేమకు అనుమానమే అతిపెద్ద అదృశ్య శత్రువు

అనుమానం... ఆధిపత్యం... ఎమోషనల్ మానిప్యులేషన్ - ప్రేమను లోపల నుంచే కూల్చే అదృశ్య శత్రువులుగా మారిపోయాయి. ప్రేమను ఒక్కసారిగా ఏదీ చంపదు. చిన్న చిన్న అలవాట్లే ప్రేమను నెమ్మదిగా కూల్చేస్తాయి. ప్రేమలో మొదట తగ్గేది నవ్వు కాదు... నమ్మకం. నమ్మకం కదిలిన క్షణం నుంచి ప్రేమ ప్రతిరోజూ పోరాడాల్సిన బంధంగా మారుతుంది. "ఆమెతో ఎందుకు మాట్లాడావు?", "అతనికి ఎందుకు లైక్ పెట్టావు?", "ఆన్‌లైన్‌లో ఉండి నాకు రిప్లై ఎందుకు ఇవ్వలేదు?" వంటి ప్రశ్నలు అప్పుడప్పుడు సహజమే. కానీ ప్రతిరోజూ అదే పరిస్థితి అయితే అది ప్రేమ కాదు... విచారణ. ప్రేమ పేరుతో నియంత్రించడం కూడా ప్రమాదకరమే. "నీ ఫ్రెండ్స్‌తో బయటకు వెళ్లొద్దు", "ఆ వ్యక్తితో మాట్లాడొద్దు", "నేను చెప్పిందే వినాలి" వంటి మాటలు మొదట శ్రద్ధలా అనిపించినా, చివరికి ఆధిపత్యంగా మారతాయి. అలాగే "నువ్వు ఇలా చేయకపోతే నేను మాట్లాడను", "నన్ను వదిలేస్తే నేను బ్రతకలేను" వంటి భావోద్వేగ ఒత్తిళ్లు ప్రేమ కాదు... ఎమోషనల్ మానిప్యులేషన్. గౌరవం పోయిన చోట ప్రేమ కూడా ఎక్కువకాలం ఉండదు. వ్యంగ్యంగా మాట్లాడడం, ఇతరుల ముందు అవమానించడం, పోల్చడం... ఇవి కనిపించని గాయాలు. జీవితంలో సమస్యలు అందరికీ ఉంటాయి. కానీ ఎప్పుడూ ప్రతికూలంగానే ఆలోచించడం కూడా బంధాన్ని అలసిపోయేలా చేస్తుంది. అలాగే కృతజ్ఞత చూపించకపోవడం కూడా ప్రేమను మసకబారుస్తుంది. ఇది మహిళలకే కాదు... పురుషులకూ వర్తిస్తుంది. అనుమానం, అహంకారం, నియంత్రించే స్వభావం, గౌరవం లేకపోవడం... ఇవి లింగానికి సంబంధించిన సమస్యలు కావు. వ్యక్తిత్వానికి సంబంధించిన సమస్యలు. ప్రేమకు కొత్త నిర్వచనం... గెలవాల్సింది మనిషిని కాదు, మనసును!

## • ప్రేమలో గెలిచేది మనిషి కాదు మనసు మాత్రమే

ప్రతి తరం ప్రేమను కొత్త కోణంలో చూసింది. ఎవరికో అది త్యాగం, మరొకరికో జీవిత లక్ష్యం, నేటి తరానికి స్వేచ్ఛతో కూడిన అనుబంధం. రూపం మారినా, ప్రేమకు పునాది మాత్రం మారలేదు. నమ్మకం, గౌరవం, నిజాయితీ, పరస్పర అవగాహన ఉన్న చోటే బంధం నిలుస్తుంది. ప్రేమలో గెలుపు అంటే ఎదుటివారిని ఓడించడం కాదు... వారి మనసును గెలుచుకోవడం. అందుకే మైండ్ గేమ్స్, కావాలనే ఆలస్యమైన రిప్లైలు, అనుమానాలు, ఆధిపత్యానికి ఇందులో చోటు ఉండకూడదు. మాటల్లో ప్రేమను నిరూపించడం కంటే, ప్రవర్తనలో చూపించడం ఎంతో విలువైనది. తప్పులు చేయడం సహజం. వాటిని అర్థం చేసుకుని కలిసి ముందుకు సాగడమే నిజమైన బంధం. సినిమాల్లో ప్రేమకు ముగింపు ఉంటుంది. జీవితంలో మాత్రం ప్రతిరోజూ కొత్త అధ్యాయం మొదలవుతుంది. అందమైన రూపం, ఖరీదైన బహుమతులు, సోషల్ మీడియా ఫాలోవర్లు కాదు... చివరివరకు నిలిచేది మనసుకు ఇచ్చే గౌరవమే. క్షణిక ఆకర్షణ బంధాన్ని ప్రారంభించవచ్చు. కానీ జీవితాంతం నిలబెట్టేది నిజాయితీ, నమ్మకం, పరస్పర గౌరవమే. ప్రేమలో గెలవాల్సింది మనిషిని కాదు... మనసును. అదే జెన్ జీ ప్రేమను ఆటగా కాకుండా, చిరస్థాయి బంధంగా మార్చే అసలైన రహస్యం.

## • జెన్ జీ ప్రేమను మార్చేసిన డేటింగ్ యాప్స్

జెన్ జీ ప్రేమలో కనిపించని మరో ప్రపంచం... డేటింగ్ యాప్స్, డిజిటల్ కనెక్షన్స్, తక్షణ నిర్ణయాల సంస్కృతి... జెన్ జీ తరం ప్రేమను అర్థం చేసుకోవాలంటే, వారి చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌ను కూడా అర్థం చేసుకోవాలి. ఒకప్పుడు ప్రేమకు పరిచయం కావాలంటే కాలేజీ, ఆఫీస్, పక్కింటి పరిచయం, కుటుంబ వేడుకలు వంటి సందర్భాలు ఉండేవి. ఇప్పుడు ఒక యాప్ చాలు. కొన్ని ఫొటోలు, కొన్ని ఆసక్తులు, రెండు మూడు మెసేజ్‌లు... అంతే. ఒక కొత్త పరిచయం మొదలవుతుంది. డిజిటల్ ప్రపంచం అపరిచితులను కూడా క్షణాల్లో దగ్గర చేస్తోంది. అదే సమయంలో దగ్గరైన వారిని కూడా క్షణాల్లో దూరం చేస్తోంది. డేటింగ్ యాప్‌లు యువతకు కొత్త అవకాశాలు ఇచ్చాయి. తమకు నచ్చిన వ్యక్తిని వెతుక్కోవడానికి, తమ అభిరుచులకు సరిపోయే భాగస్వామిని కలవడానికి అవి ఒక వేదికగా మారాయి. కానీ అదే సమయంలో ఎంపికలు ఎక్కువ కావడం వల్ల స్థిరత్వం తగ్గిందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. "ఇతను కాకపోతే ఇంకొకరు ఉంటారు", "ఈ సంబంధం కుదరకపోతే మరో అవకాశం వస్తుంది" అనే ఆలోచన కొన్నిసార్లు బంధాలను లోతుగా అర్థం చేసుకునే సహనాన్ని తగ్గిస్తోంది.

## • లాంగ్ డిస్టెన్స్ ప్రేమ లాజిక్ వర్కౌట వుతుందా?

ఉద్యోగాలు, ఉన్నత చదువులు, విదేశీ అవకాశాలతో లాంగ్ డిస్టెన్స్ రిలేషన్‌షిప్‌లు నేటి యువతలో సాధారణమయ్యాయి. వీడియో కాల్స్, చాట్‌లు, వర్చువల్ డేట్స్ దూరాన్ని తగ్గిస్తున్నా, నిజమైన బంధాన్ని నిలబెట్టేది మాత్రం సాంకేతికత కాదు. పరస్పర నమ్మకం, స్పష్టమైన సంభాషణే ఆ బలం. సమయం తక్కువైనా, మాట్లాడే ప్రతి క్షణం నిజాయితీతో ఉండాలి. లేదంటే అపార్థాలు, అనుమానాలు నెమ్మదిగా సంబంధాన్ని బలహీనపరుస్తాయి. పాత తరంతో పోలిస్తే నేటి ప్రేమలో అవకాశాలు విస్తరించాయి. అయితే ఎంపికలు పెరిగిన కొద్దీ స్థిరత్వం తగ్గిందనే భావన కూడా కనిపిస్తోంది. ఒకప్పుడు లేఖ కోసం రోజులు ఎదురుచూసే ఓర్పు ఉండేది. ఇప్పుడు చిన్న ఆలస్యం కూడా సందేహాలకు దారి తీస్తోంది. మరోవైపు, గౌరవం లేని బంధాల నుంచి బయటపడే అవగాహన యువతలో పెరగడం సానుకూల మార్పే. అయితే ప్రతి చిన్న అపార్థానికీ సంబంధాన్ని ముగించడం పరిష్కారం కాదు. ఓపికతో మాట్లాడి ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నమే ప్రేమను కాల పరీక్షలో నిలబెడుతుంది.

## • గ్రీన్ ఫ్లాగ్స్... రెడ్ ఫ్లాగ్స్... ప్రేమలో కొత్త నిఘంటువు

నేటి ప్రేమలో భావాల కంటే కొత్త పదాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. గ్రీన్ ఫ్లాగ్, రెడ్ ఫ్లాగ్, గ్యాస్‌లైటింగ్, లవ్ బాంబింగ్, ఘోస్టింగ్, బ్రెడ్‌క్రంబింగ్ వంటి పదాలు యువత సంబంధాలను అర్థం చేసుకునే కొత్త భాషగా మారాయి. ఇవి విషపూరిత బంధాలను గుర్తించడంలో ఉపయోగపడుతున్నా, ప్రతి చిన్న లోపాన్నీ ప్రమాద సంకేతంగా చూడడం సమస్యలను పెంచుతోంది. ఎవరూ పరిపూర్ణులు కారు. ప్రతి వ్యక్తిలో మంచి లక్షణాలతో పాటు కొన్ని బలహీనతలు కూడా సహజమే. ఒక అపార్థం లేదా చిన్న పొరపాటు జరిగిన వెంటనే బంధాన్ని ముగించడం కంటే, ప్రశాంతంగా మాట్లాడుకుని పరిష్కారం వెతకడం మరింత విలువైనది. ప్రేమ అనేది పరీక్ష కాదు, పరస్పర అవగాహనతో ఎదిగే ప్రయాణం. నమ్మకం, ఓర్పు, సంభాషణ కలిసి ఉంటేనే బంధం బలపడుతుంది. తీర్పు చెప్పే తొందర కంటే వినే మనసు గొప్పది. తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఇచ్చినప్పుడే సంబంధం లోతుగా మారుతుంది. నిజమైన ప్రేమకు కొత్త పదజాలం కాదు, పరస్పర గౌరవం, సహనం, అర్థం చేసుకునే మనసే అసలైన నిఘంటువు.

## • ప్రేమను నిలబెట్టేది అది ఒక్కటే...!

ప్రేమను నిలబెట్టే అసలైన బలం సంభాషణ. చెప్పని భావాలు, దాచిన బాధలు, పెరిగిన అపార్థాలే చాలా బంధాలను దూరం చేస్తాయి. మనసులో ఏముందో స్పష్టంగా చెప్పడం, ఎదుటివారి మాటను ఓపికగా వినడం, విభేదాల సమయంలో కూడా గౌరవాన్ని కాపాడుకోవడం ఆరోగ్యకరమైన సంబంధానికి పునాది. మౌనం సమస్యలను పరిష్కరించదు; నిజాయితీతో కూడిన సంభాషణే పరిష్కారం చూపుతుంది. కాలంతో పాటు ప్రేమను వ్యక్తం చేసే విధానం మారవచ్చు. లేఖల స్థానంలో వీడియో కాల్స్, ఎమోజీలు, సోషల్ మీడియా వచ్చినా, బంధాన్ని నిలబెట్టే విలువలు మాత్రం శాశ్వతం. నమ్మకం, పరస్పర గౌరవం, నిజాయితీ, కృతజ్ఞత, స్వేచ్ఛ ఉన్నప్పుడే ప్రేమ కాల పరీక్షను తట్టుకుంటుంది. మైండ్ గేమ్స్, అహంకారం, నటన క్షణిక ఆకర్షణను మాత్రమే ఇస్తాయి. జీవితాంతం తోడుగా నిలిచేది నిజమైన మనసే. అందుకే జెన్ జీ ప్రేమను విమర్శించడం కాదు, అర్థం చేసుకోవడం అవసరం. అదే సమయంలో యువత కూడా ప్రేమలో విజయం అంటే ఒకరిపై మరొకరు గెలవడం కాదని, ఇద్దరూ కలిసి బంధాన్ని గెలిపించడమేనని గుర్తుంచుకోవాలి.



# దేవదత్ ధమాకా.. లంకపై భారత్ జోరు

## 167 పరుగులతో చెలరేగిన పడిక్కల్





గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు దేవదత్ పడిక్కల్ 167 పరుగులతో అదరగొట్టాడు. వర్షం కారణంగా ఆటకు అంతరాయం కలిగినా భారత్ ఆధిపత్యం కొనసాగింది. తొలి రోజు 288/2తో ఆట ముగించిన భారత్.. రెండో రోజు బ్యాటింగ్‌లో మరింత దూకుడు చూపించింది. పడిక్కల్ అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరు దిశగా సాగింది.

### రెండో కొత్త బంతితో లంక ఎదురుదాడి

రెండో కొత్త బంతి చేతికి వచ్చిన తర్వాత శ్రీలంక బౌలర్లు మ్యాచ్‌లోకి తిరిగి వచ్చారు. 81వ ఓవర్ తర్వాత భారత్‌కు వరుస షాక్‌లు తగిలాయి. రిషభ్ పంత్ వికెట్ పడటం లంకకు కీలక మలుపుగా మారింది. ఆ తర్వాత భారత బ్యాటర్లు స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేరారు. అయినా పడిక్కల్ ఇచ్చిన బలమైన పునాది కారణంగా భారత్ భారీ స్కోరు సాధించే స్థితిలో నిలిచింది. స్పిన్‌కు అనుకూలంగా ఉన్న గాలే పిచ్‌పై భారత బ్యాటింగ్ ప్రదర్శన ఆకట్టుకుంది. జూరెల్ అర్ధశతకం.. జయసూర్యకు 4 వికెట్లు ఆట ముగిసే సమయానికి భారత్ 116 ఓవర్లలో 460/9 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్ 167 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ధ్రువ్ జూరెల్ 51 పరుగులతో అర్ధశతకం పూర్తి చేశాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 4/109తో అత్యధిక వికెట్లు తీశాడు. వర్షం ప్రభావంతో ఓవర్లు తగ్గినా.. రెండో రోజు భారత్ స్పష్టమైన ఆధిక్యం సాధించింది. భారీ స్కోరు, పడిక్కల్ అద్భుత శతకం, లంకపై ఒత్తిడి ఇప్పుడు మ్యాచ్‌లో కీలక అంశాలుగా మారాయి.

### 167 పరుగులతో మెరిసిన పడిక్కల్

గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు దేవదత్ పడిక్కల్ 167 పరుగుల అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్‌ను బలమైన స్థితిలో నిలిపాడు. వర్షం కారణంగా ఆట మధ్యాహ్నం 2.35 గంటలకు ఆలస్యంగా మొదలైనా.. భారత్ 288/2తో కొనసాగించిన ఇన్నింగ్స్‌ను 460/9 వరకు తీసుకెళ్లింది. 131 పరుగులతో ఆట మొదలు పెట్టిన పడిక్కల్ 215 బంతుల్లో తన తొలి 150 పూర్తి చేశాడు. అసిత ఫెర్నాండో బంతిని బౌండరీకి తరలించి ఈ మైలురాయిని అందుకున్నాడు. తర్వాత 167 పరుగుల వద్ద ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. నంబర్3 స్థానంలో పడిక్కల్ ప్రదర్శన భారత్‌కు మరో బలమైన బ్యాటింగ్ ఎంపికను ఇచ్చింది.



# బంగ్లా సంచలనం.. ఆసీస్‌కు షాక్

## ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ చరిత్ర

ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్ర సృష్టించింది. డార్విన్‌లో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై తొలిసారి గెలిచి సంచలన విజయం నమోదు చేసింది. 2003లో ఇదే డార్విన్ వేదికగా ఆస్ట్రేలియాతో తొలిసారి టెస్టు ఆడిన బంగ్లా.. 23 ఏళ్ల తర్వాత అదే మైదానంలో చారిత్రక విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాను బంగ్లా బౌలర్లు 198 పరుగులకే కట్టడి చేశారు. హసన్ మహమూద్ ఆరు వికెట్లతో చెలరేగి ఆసీస్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చాడు. స్టీవ్ స్మిత్ 71 పరుగులతో పోరాడినా అతడికి మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం లభించలేదు.

### బ్యాటింగ్‌లోనూ బంగ్లా దూకుడు

ఆస్ట్రేలియా తక్కువ స్కోరుకు పరిమితం కావడంతో బంగ్లాదేశ్ బ్యాటర్లు భారీ ఆధిక్యం సాధించేలా ఆడారు. తంజీద్ హసన్ తమీమ్ తన రెండో టెస్టులోనే 101 పరుగులతో శతకం సాధించాడు. మొమినుల్ హక్ 49, నజ్ముల్ హొస్సేన్ శాంటో 84, మెహిదీ హసన్ మిరాజ్ 65 పరుగులతో కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. దీంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగులు చేసి 228 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా కొంత పోరాటం చూపినా.. కామెరాన్ గ్రీన్ 104 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. చివరకు ఆస్ట్రేలియా 284 పరుగులకే ఆలౌటైంది.

### 57 పరుగుల లక్ష్యం.. ఈజీ ఛేజ్

బంగ్లాదేశ్ విజయానికి నాలుగో రోజు కేవలం 57 పరుగుల లక్ష్యం మాత్రమే మిగిలింది. తంజీద్ హసన్ తమీమ్ రెండో ఓవర్‌లోనే గోల్డెన్ డక్‌గా వెనుదిరిగినా.. బంగ్లాకు పెద్దగా ఇబ్బంది ఎదురుకాలేదు. తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించి ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు గెలుపును సొంతం చేసుకుంది. ఇప్పటివరకు ఇరు జట్ల మధ్య జరిగిన ఏడు టెస్టుల్లో ఆస్ట్రేలియా ఐదు గెలిచింది, ఒకటి డ్రాగా ముగిసింది. తాజా విజయం బంగ్లాదేశ్‌కు తొలి విదేశీ టెస్టు విజయం. 2017లో సొంత గడ్డపై ఆస్ట్రేలియాను ఓడించిన బంగ్లా.. ఇప్పుడు డార్విన్‌లో మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. సిరీస్ విజయం సాధించాలన్న లక్ష్యంతో బంగ్లా ఇప్పుడు మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతోంది.

# మాటల్లేవ్... మాట్లాడుకోటాల్లేవ్

## ఓటమిపై కెప్టెన్ కీలక వ్యాఖ్యలు



ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ చేతిలో తొమ్మిది వికెట్ల ఘోర పరాజయం ఎదుర్కొన్న ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమ్మిన్స్ ఎలాంటి సాకులు చెప్పలేదు. డార్విన్ టెస్టులో తమ జట్టు అన్ని విభాగాల్లో బంగ్లాదేశ్ కంటే వెనుకబడిందని అంగీకరించాడు. గతంలో బంగ్లాదేశ్ సిరీస్ కోసం తమ ఆటగాళ్లు ది హండ్రెడ్‌లో వచ్చే అర మిలియన్ పౌండ్ల వరకు ఆదాయాన్ని వదులుకుని టెస్టులకు సిద్ధమయ్యారని కమ్మిన్స్ చెప్పిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అయితే ఓటమి తర్వాత జట్టు సన్నాహకాలపై తనకు ఎలాంటి ఫిర్యాదు లేదని స్పష్టం చేశాడు. తొలి రోజే మ్యాచ్‌పై పట్టు కోల్పోయామని కమ్మిన్స్ చెప్పాడు. ఆ రోజు పిచ్ కొంత కష్టంగా ఉన్నా.. బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవాల్సిందని అభిప్రాయపడ్డాడు. బంతితోనూ ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురాలేకపోయామని తెలిపాడు. బంగ్లాదేశ్ అత్యంత ఓపికగా, క్రమశిక్షణతో ఆడి అన్ని విభాగాల్లో తమను మించిపోయిందని కమ్మిన్స్ అంగీకరించాడు. రెండో టెస్టుకు జట్టులో మార్పులు ఉండొచ్చని సూచించినా..వెంటనే నిర్ణయాలు తీసుకోకుండా మ్యాచ్‌ను పూర్తిగా సమీక్షిస్తామని చెప్పాడు. ఈ ఓటమి నుంచి తమ ఆటగాళ్లు బలంగా తిరిగి వస్తారని కమ్మిన్స్ ధీమా వ్యక్తం చేశాడు.

### బంగ్లా చరిత్ర.. పాక్ రికార్డు బద్దలు

### ఆసీస్ గడ్డపై వేగవంతమైన విజయం

డార్విన్ టెస్టులో ఆస్ట్రేలియాపై తొమ్మిది వికెట్ల ఘన విజయం సాధించిన బంగ్లాదేశ్ అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు విజయం సాధించిన వేగవంతమైన ఆసియా జట్టుగా నిలిచింది. గతంలో ఆస్ట్రేలియాలో తొలి టెస్టు విజయం కోసం పాకిస్థాన్ ఏడు మ్యాచ్‌లు ఆడాల్సి వచ్చింది. భారత్ 12 టెస్టుల తర్వాత ఈ ఘనత సాధించింది. బంగ్లాదేశ్ మాత్రం కేవలం మూడో ప్రయత్నంలోనే ఆసీస్‌ను వారి సొంత గడ్డపై ఓడించింది. ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో రెండు టెస్టులు ఆడిన బంగ్లా.. రెండింటిలోనూ ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో మాత్రం పూర్తి స్థాయి ఆస్ట్రేలియా జట్టుపై ఆధిపత్యం ప్రదర్శించింది. తొలుత ఆసీస్‌ను 198 పరుగులకే కట్టడి చేసిన బంగ్లా.. తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగులు చేసి 228 పరుగుల ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో కామెరాన్ గ్రీన్ 104 పరుగులతో పోరాడినా ఆస్ట్రేలియా 284 పరుగులకే ఆలౌటైంది. 57 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లా ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఆసియా జట్లలో ఆస్ట్రేలియాలో ఇంకా టెస్టు విజయం సాధించని ఏకైక జట్టు శ్రీలంక. ఆ జట్టు ఇప్పటికే అక్కడ 15 టెస్టులు ఆడింది. తాజా విజయంతో బంగ్లాదేశ్ పేరు క్రికెట్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది.

### ఆసీస్ ఓటమితో

### మారిన పాయింట్ల లెక్కలు

డార్విన్ టెస్టులో ఆస్ట్రేలియాపై తొమ్మిది వికెట్ల చారిత్రక విజయం సాధించిన బంగ్లాదేశ్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారీగా ఎగబాకింది. ఈ గెలుపుతో బంగ్లా నాలుగో స్థానానికి చేరుకుంది. ఆ జట్టు పీసీటీ 58.33 నుంచి 66.67కి పెరిగింది. మరోవైపు ఓటమి ఎదురైనా ఆస్ట్రేలియా 77.77 పీసీటీతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా 75.00తో రెండో స్థానంలో, న్యూజిలాండ్ 72.22తో మూడో స్థానంలో ఉన్నాయి. బంగ్లా విజయం భారత జట్టు ఫైనల్ అవకాశాల లెక్కలపై కూడా ప్రభావం చూపింది. ప్రస్తుతం 48.15 పీసీటీతో భారత్ ఐదో స్థానంలో ఉంది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే మిగిలిన తొమ్మిది టెస్టుల్లో కనీసం ఏడు విజయాలు సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్రీలంకతో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్ భారత్‌కు కీలకంగా మారింది. మరోవైపు బంగ్లాదేశ్ తాజా విజయంతో ఫైనల్ రేసులో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంది. ఆస్ట్రేలియా ఆధిపత్యానికి బంగ్లా ఇచ్చిన షాక్ డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికను మరింత ఆసక్తికరంగా మార్చింది.

# 'విశ్వనాథ్ & సన్స్'కు ప్రేక్షకులే అసలైన హీరోలు

## బాక్సాఫీస్ వద్ద ఫ్యామిలీ మ్యాజిక్



సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన 'విశ్వనాథ్ & సన్స్'కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ఆగస్టు 14న విడుదలైన ఈ కుటుంబ కథా చిత్రం థియేటర్లలో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందాన్ని అభినందించారు.

### సూర్యపై త్రివిక్రమ్ ప్రశంసల వర్షం

ఈ సందర్భంగా త్రివిక్రమ్ మాట్లాడుతూ.. 'విశ్వనాథ్ & సన్స్'కు నిజమైన హీరోలు ప్రేక్షకులేనని అన్నారు. సూర్య నటనను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ.. 'గజినీ'లోని సంజయ్ రామస్వామి పాత్ర ఇప్పటికీ ప్రేక్షకుల మనసుల్లో ఉందన్నారు. ఈ సినిమాలో సూర్య చాలా కష్టమైన పాత్రను అద్భుతంగా చేశారని ప్రశంసించారు. రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్, మమితా బైజు కూడా సినిమాకు కీలక బలమని చెప్పారు. త్వరలో సూర్యతో సినిమా చేయాలని ఉందని త్రివిక్రమ్ తెలిపారు.

### ప్రేక్షకుల ప్రేమకు సూర్య ఫిదా

సూర్య మాట్లాడుతూ.. ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు చెప్పేందుకు మాటలు సరిపోవడం లేదన్నారు. వివిధ భాషలు, ప్రాంతాల నుంచి వచ్చిన నటీనటులు కలిసి మంచి సినిమా చేశామని, దాన్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారని చెప్పారు. ఫ్యామిలీ సినిమాలకు ప్రేక్షకులు మళ్లీ లైఫ్ ఇచ్చారని పేర్కొన్నారు. కొన్ని సినిమాలను వసూళ్లతో కాకుండా ప్రేక్షకులు పొందిన అనుభూతితో కొలవాలని అన్నారు.

### రెండో రోజే రెట్టింపు వసూళ్లు

దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. యాక్షన్, హారర్, డార్క్ కామెడీ ట్రెండ్‌లోనూ ఫ్యామిలీ కథను నమ్మి సినిమా చేశామని తెలిపారు. రెండో రోజు వసూళ్లు మొదటి రోజుతో పోలిస్తే రెట్టింపు కావడం తన కెరీర్‌లోనే ప్రత్యేక అనుభవమన్నారు. ఈ విజయానికి ప్రధాన కారణం సూర్యేనని, సినిమాను ఆయన భుజాలపై మోశారని చెప్పారు. ప్రేక్షకుల ఆదరణతో 'విశ్వనాథ్ & సన్స్' విజయోత్సవం మరింత జోరందుకుంది.



# బల్లగుద్ది చెప్తున్నా.. ఇరుముడి అదిరిపోద్ది!

• ఆగస్టు 21న థియేటర్లలో తాండవం • 'ఇరుముడి'పై రవితేజ గట్టి నమ్మకం

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి'పై అంచనాలు భారీగా పెరిగాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 21న థియేటర్లలోకి రానుంది. గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ సినిమా మంచి ఎమోషనల్ రైడ్‌గా ఉంటుందని, ప్రతి పాత్ర ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతుందని చెప్పారు. "బల్లగుద్ది చెబుతున్నా.. ఈ సినిమా మీకు తెగ నచ్చేస్తుంది" అంటూ తనదైన స్టైల్‌లో సినిమాపై నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా బేబీ నక్షత్రతో తన కాంబినేషన్ సీన్లు ప్రేక్షకులను టచ్ చేస్తాయని చెప్పారు. ప్రియా భవానీ శంకర్ 'కావేరి' పాత్రలో అద్భుతంగా నటించిందని ప్రశంసించారు. సాయికుమార్, స్వాసిక సహా ప్రతి నటుడి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని రవితేజ తెలిపారు.

### మల్లెపూల పల్లకి.. భక్తి బీట్‌కు మాస్ టచ్

'ఇరుముడి' నుంచి విడుదలైన 'మల్లెపూల పల్లకి' పాట గూస్‌బంప్స్ తెప్పించేలా ఉందని చిత్రబృందం చెబుతోంది. అయ్యప్ప భక్తి గీతానికి కొత్త మ్యూజికల్ టచ్ ఇచ్చిన జీవీ ప్రకాష్ కుమార్ పవర్‌ఫుల్ బీట్స్, గ్రాండ్ ఆర్కెస్ట్రేషన్‌తో పాటకు మాస్ ఎనర్జీ జోడించారు. డప్పు శ్రీను గాత్రం పాటకు రా, డివోషనల్ ఫీల్ తీసుకొచ్చింది. అయ్యప్ప భక్తుడి గెటప్‌లో రవితేజ ఎనర్జిటిక్ డ్యాన్స్ ఆకట్టుకుంటోంది. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ, భారీ సంఖ్యలో భక్తులతో తెరకెక్కించిన విజువల్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. థియేటర్లలో ఈ పాటకు మంచి రెస్పాన్స్ రావడం ఖాయమని చిత్రబృందం నమ్ముతోంది.

### లైట్‌హార్టెడ్ కాదు.. ఇంటెన్స్ ఫ్యామిలీ డ్రామా

దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ 'ఇరుముడి' తన గత చిత్రాలకు భిన్నంగా చాలా సీరియస్, ఇంటెన్స్ ఫ్యామిలీ డ్రామా అని చెప్పారు. చివరి 40 నిమిషాలు ప్రేక్షకులను తీవ్ర భావోద్వేగాల్లోకి తీసుకెళ్తాయని తెలిపారు. అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తుడి నేపథ్యంతో సాగే థ్రిల్లర్‌లో కమర్షియల్ అంశాలతో పాటు కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చినట్టు చెప్పారు. నిర్మాత రవిశంకర్ సినిమా అనుకున్నదానికంటే అద్భుతంగా వచ్చిందని, బ్లాక్‌బస్టర్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. జీవీ ప్రకాష్‌కుమార్ ఈ చిత్రం తనకు ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. రవితేజ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాగా 'ఇరుముడి' నిలుస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర కూడా తమ పాత్రలపై నమ్మకం వ్యక్తం చేశారు. ఆగస్టు 21న ప్రేక్షకులు థియేటర్లలో ఒక డిఫరెంట్ రవితేజను చూడబోతున్నారు.

# అలాంటి వాటిని నేను ఎప్పుడూ ప్రోత్సహించను



### రష్మిక కామెంట్లపై యష్ కూల్ రియాక్షన్

నేషనల్ క్రష్ రష్మిక మందానా గతంలో తనను ఉద్దేశించి 'మిస్టర్ షో ఆఫ్' వ్యాఖ్యలపై పాన్ ఇండియా స్టార్ యశ్ తాజాగా హుందాగా స్పందించారు. అప్పట్లో ఆమె ఇండస్ట్రీకి కొత్త అని, టీవీ షోలో ఇచ్చిన ఆప్షన్లను బట్టి అలా అని ఉండొచ్చని పేర్కొన్నారు. ఒకరి అభిప్రాయం తన వ్యక్తిత్వాన్ని ఎప్పటికీ నిర్ణయించలేదని, తోటి నటీనటులను గౌరవించని వారు తన అభిమానులు కాబోరని తేల్చి చెప్పారు. ఇక తాను నటిస్తున్న 'టాక్సిక్' చిత్రంలోని బోల్డ్ అంశాలపై స్పందిస్తూ.. తాను అశ్లీలతను ప్రోత్సహించనని, నేటి తరం యువతను దృష్టిలో ఉంచుకుని ఈ సినిమా తీశామని క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రం ఆగస్టు 26న విడుదల కానుంది.

సినీనటులు పలు సందర్భాల్లో చేసే కొన్ని కామెంట్లు ఒక్కోసారి అనూహ్య వివాదాలకు దారితీస్తుంటాయి. ఈ కోవలోనే నేషనల్ క్రష్ రష్మిక మందానా గతంలో హీరో యష్ పై చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. అయితే ఆ వ్యాఖ్యలపై తాజాగా యష్ హుందాగా స్పందిస్తూ తన పరిణితి చాటుకున్నారు.

**జరిగింది ఇదీ..**

కన్నడలో 'కిర్రాక్ పార్టీ' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన రష్మిక మందానా 2017లో పాల్గొన్న ఒక టీవీ కార్యక్రమంలో రాపిడ్ ఫైర్ రౌండ్‌లో శాండల్‌వుడ్‌లో 'మిస్టర్ షో ఆఫ్' ఎవరు అనే ప్రశ్నకు యశ్ పేరును ప్రస్తావించారు. అప్పట్లో ఈ వ్యాఖ్యలు కన్నడ చిత్ర పరిశ్రమలో తీవ్ర దుమారం రేపాయి. యశ్ అభిమానులు, నెటిజన్లు ఆమెపై తీవ్రస్థాయిలో మండిపడటంతో, అది కేవలం సరదా రౌండ్‌లో ఇచ్చిన సమాధానమేనని, ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరుతూ రష్మిక బహిరంగ ప్రకటన చేయాల్సి వచ్చింది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.